Email:prajamantalu@gmail.com

www.prajamantalu.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 4

సంచిక : 73

శుక్రవారం, ఆగస్టు,25,2023

పేజీలు - 8 వెల - రూ 5 : 00

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri


## అల్లు అర్జున్‌కి జాతీయ స్థాయి గుర్తింపు..



హైదరాబాద్,ఆగస్ట్24:
69వ జాతీయ సినిమా అవార్డులలో తెలుగు చల న చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు అల్లు అర్జు న్‌కు జాతీయ ఉత్తమ నటుడు అవార్డ్ కు ఎం పికవడం తెలుగు సినీ పరిశ్రమకు గర్వకారణ మని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ మేరకు హీరో అల్లు అర్జున్‌కు శు భాకాంక్షలు తెలిపా రు. ట్రిపుల్ ఆర్ సినిమాకు కూడా పలు అంతర్జాతీ య అవార్డులు రావడం నిజంగా ఎంతో ఆనందిం చ దగిన విషయమ న్నారు. జాతీయ స్థాయి అవా ర్డులతో తెలుగు వారి ఆత్మగౌరవం మరింత పెరిగిం దన్నారు.

## కవిత కోసం కామారెడ్డి..



నిజామాబాద్, : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి నుంచి ఎన్నికల బరిలోకి దిగితే.. ఆ చుట్టు పక్కల ఉన్న జిల్లాలు.. నిజామాబాద్‌తోపాటు కరీంనగర్, ఆదిలాబాద్‌లపై కూడా ఆయన గెలుపు ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని కేసీఆర్ భావిస్తున్నారు. అలాగే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి మళ్లీ కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత.. పోటీకి దిగితే.. ఆమె గెలుపు నల్లేరు మీద నడకే అవుతోందనే ఓ చర్చ సైతం సదరు పొలిటికల్ సర్కిల్‌లో నడుస్తోంది.



## డీఎస్సీ రెండ్రోజుల్లో నోటిఫికేషన్

### 6,500 పోస్టుల భర్తీకి త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్

### వెల్లడించిన విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, : పాఠశాల విద్యకు సంబంధించి టీచర్ పోస్టుల భర్తీకి త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. 6,500 పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఆమె తెలిపారు. పాఠశాల విద్యలో 5,089 పోస్టులు, ప్రత్యేక విద్యార్థుల పాఠశాలల్లో 1523 పోస్టుల భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈసారి టీఎస్‌పీఎస్సీ ద్వారా కాకుండా డీఎస్సీ ద్వారానే పోస్టుల భర్తీ చేస్తామని చెప్పారు. దీనికి సంబంధించి రెండ్రోజుల్లోనే నోటిఫికేషన్, విధివిధానాలను విడుదల చేస్తామని స్పష్టం చేశారు. రెండ్రోజుల్లోనే జిల్లా కలెక్టర్లు డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తారన్నారు. ఈ మేరకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడారు. విద్యారంగంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారని మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతు న్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది విద్యారంగానికి రూ.29,613 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. గురుకులాల్లో మనందరం గర్వపడేలా సత్ఫలితాలు వస్తున్నాయని అన్నారు.

## కొడంగల్ నుంచే పోటీ చేస్తా

### టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి



రంగారెడ్డి: దాడులు చేసి ఎన్నికల్లో గెలవలనుకునే వారికి ప్రజలు గుణపాఠం చెబుతారని టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం నాడు కొడంగల్ లో అయన మీడియాతో మాట్లాడారు. కొడంగల్ ను దత్తత తీసుకుంటామని ఆనాడు కేసీఆర్ మాట ఇచ్చి మోసం చేశారు. హైదరాబాద్-బీజాపూర్ హైవే తెచ్చింది నేను. కొడంగల్ లో కట్టిన గుడి, బడి అన్నీ నా హయాంలో జరిగిన అభివృద్ధి మాత్రమే. కొడంగల్ కు తాగునీరు తెచ్చి దాహార్తిని తీర్చింది నేను కాదా ? కొడంగల్ నియోజకవర్గానికి 30 సబ్ స్టేషన్లు తెచ్చింది మేమని అన్నారు. కొడంగల్ ప్రజలకు బస్ డిపో తెచ్చింది మేము. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి మా హయాంలోనే జరిగింది. బీఆరెస్ హయాంలో నారాయణ్ పేట్ లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయకుండా కొడంగల్ కి అన్యాయం చేశారు. నేను చేసిన పనులకు శిలాఫలకాలు వేయడం తప్ప బీఆరెస్ చేసిందేం లేదు. జిల్లాలు పెంచి కొడంగల్ ను ముక్కలు చెక్కలు చేశారు. కేసీఆర్, కేటీఆర్ దత్తత తీసుకుంటే కొడంగల్ కు ఏం జరిగింది? రెండేళ్లలో కృష్ణా జలాలు తెచ్చి కాళ్లు కడుగుతామని కేసీఆర్ అనలేదా. ఐదేళ్లయినా ఎందుకు తీసుకురాలేదు.

## ప్రతిపక్షాలే లక్ష్యంగా.. కేసీఆర్ అడుగులు



ఖమ్మం, : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం పట్టణం జనరల్ అసెంబ్లీ స్థానం. ఇక్కడ భారతీయ జనతా పార్టీకి జిల్లా అధ్యక్షుడిగా కోనేరు చిన్ని అలియాస్ కోనేరు సత్యనారాయణ కొనసాగుతున్నారు ఒకేసారి 115 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించి సంచలనం సృష్టించిన ముఖ్యమంత్రి కేసీఆర్.. అదే దూకుడును కొనసాగిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. నిన్న సాయంత్రం దాకా అభ్యర్థుల పేర్లు ప్రకటించి హడావిడి సృష్టించిన ఆయన.. సాయంత్రం ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టే కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగానే భారతీయ జనతా పార్టీ కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిని తన వద్దకు పిలిపించుకున్నారు. తనదైన ఓటు రాజకీయాలకు తెరదీశారు. అంతేకాదు ఎన్నికలకు ముందు కొత్తగూడెం కమలం పార్టీలో కల్లోలం సృష్టించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం పట్టణం జనరల్ అసెంబ్లీ స్థానం.




## పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు

### మంత్రి తలసాని

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తొమ్మిదిన్నర సంవత్సరాలలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం బంజారాహిల్స్ లోని బంజార భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని :అ కులవృత్తి దారులకు ప్రభుత్వం మంజూరు చేసిన లక్ష రూపాయల ఆర్థిక సహాయం చెక్కులను స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి లతో కలిసి 300 మంది లబ్ధిదారులకు అందజేశారు.

## మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పట్నం మహేందర్‌రెడ్డి

హైదరాబాద్ : కేబినెట్ మంత్రిగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం రాజ్ భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మహేందర్‌రెడ్డి చేత మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి? కేసీఆర్‌తోపాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు హాజరయ్యారు.




## రష్యాలో విమాన ప్రమాదం.. వాగ్నర్ చీఫ్ ప్రిగోజిన్ మృతి



మాస్కో: రష్యాలో బుధవారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 10 మంది దుర్మరణం పాలయ్యారు. రష్యా అనుకూల కిరాయి సైనిక ముఠా వాగ్నర్ గ్రూప్ చీఫ్ యెవ్‌గెనీ ప్రిగోజిన్ కూడా వారిలో ఉన్నట్టు అనుమాని స్తున్నారు. ప్రయాణికుల జాబితాలో ఆయన పేరు కూడా ఉన్నట్టు అధికా రులు ధ్రువీకరించారు. అయితే ప్రిగోజిన్ విమానం ఎక్కిందీ లేనిదీ తేలడం లేదు. అతని సొంత విమానమని చెబుతున్న సదరు ప్రైవేట్ బిజినెస్ జెట్ రష్యా రాజధాని మాస్కోకు 100 కిలోమీటర్ల దూరంలో త్వెర్ ప్రాంతంలో కుప్పకూ లింది.



## రింగ్ రోడ్ పై రోడ్డు ప్రమాదం

### ఆగివున్న టిప్పర్ను ఢీ కొన్న కంటైనర్ - ఇద్దరు స్పాట్ డెడ్

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోను రింగ్ రోడ్ పై రోడ్ ప్రమాదం జరిగింది. ఆగివున్న టిప్పర్ ను కంటైనర్ ఢీ కొట్టింది. ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాలపాలైన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. ఒక మృతదేహం లారీ లో చిక్కుకుంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచరారణ చేపట్టారు.

## అవినీతి రహిత పాలన అందించడమే భాజపా లక్ష్యం

### భాజపా జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్


(రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి ఆగస్ట్ 24 (ప్రజా మంటలు): అవినీతి రహిత ప్రజాహిత పరిపాలన అందించడమే భారతీయ జనతా పార్టీ లక్ష్మమని, ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు గురువారం ధర్మపురి క్షేత్రంలో... ఎమ్మెల్యే ప్రభాస్ యోజన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశానికి ముందు దివంగత నేత అరుణ్ జైట్లీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మీడియా ప్రతినిధుల సమావేశంలో డాక్టర్ వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ సమర్థ అనుభవజ్ఞుడైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశం అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో పోటీపడుతున్నదన్నారు. దేశంలో ప్రజల సౌకర్యార్థం జాతీయ రహదారుల విస్తరణ నుండి చంద్రయాన్ విజయవంతం వరకు ప్రధాని మోడీ చేస్తున్న కృషి ప్రపంచ ప్రజల ప్రజల ప్రశంసలను అందుకుంటున్నదన్నారు. కోవిడ్ మహమ్మారి వరబలిన సందర్భంగా 45 వేల కోట్ల వ్యయంతో దేశంలో తయారైన టీకాలను మూడు డోసులుగా ఉచితంగా వేయించిన ఘనత మోడీకే చెందుతుందన్నారు. మూడున్నర లక్షల కోట్ల ఖర్చుతో 60 వేల కిలోమీటర్ల మేరకు జాతీయ రహదారులను విస్తరింపచేసే కార్యక్రమాలు చేపట్టారు అన్నారు. ఆయుష్మాన్ భారత్ కింద ఐదు లక్షల రూపాయల వరకు ఉచిత చికిత్స లభింప చేస్తున్నారని భాజపా లిత రాష్ట్రాలలో ఈ పథకం 10 లక్షల వరకు అందుతున్నదన్నారు. కెసిఆర్ ప్రభుత్వం హామీలకే గాని ఆచరణకు దూరంగా పాలన సాగిస్తున్నదని, ఎమ్మెల్యేలలో అవినీతి గురించి ముఖ్యమంత్రి నోటనే స్వయంగా వెలువడడాన్ని బట్టి రాష్ట్ర స్థితి స్పష్టం అవుతున్నది అన్నారు. ఎమ్మెల్యే



ప్రవాసన యోజన కింద ఇతర రాష్ట్రాల నుండి శాసనసభ్యులు ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలో పర్యటించి నియోజకవర్గాల వారీగా పరిస్థితుల గురించి సమస్యల గురించి ఆయా రాష్ట్ర పార్టీ బాధ్యులకు నివేదికలు సమర్పిస్తారన్నారు అందరూ భాగంగా ధర్మపురి నియోజకవర్గానికి ఉత్తరప్రదేశ్ లోని ఖుషి నగర్ శాసనసభ్యులు పిఎన్ పాఠక్ రావడం జరిగింది అని, సంబంధిత విషయాలపై అవగాహన కలిగి రాష్ట్ర పార్టీ బాధ్యులకు నివేదిక అందజేస్తారని వివరించారు. రానున్న శాసనసభ ఎన్నికలలో తమ పార్టీ గెలుపు గుర్రాలని బరిలోకి దించనుందని ధర్మపురి నియోజక వర్గం కూడా భాజపా ఖాతా లోకి వెళ్ళడం ఖాయమన్నారు. పార్టీ ఆదేశిస్తే తాను తప్పక పోటీ చేయగలరని ఒక ప్రశ్నకు సమాధానంగా స్పష్టం చేశారు. మండల భాజపా అధ్యక్షుడు సంగేపు గంగారాం, నాయకులు ఓరగంటి చంద్రశేఖర్, నలమాసు వైకుంఠం, కస్తూరి సత్యం, బండారి లక్ష్మన్, బత్తిని తిరుపతి బెజ్జారపు లవణ కుమార్, మల్లేశం, దివిటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజానాడి






## మైనంపల్లిపై వేటుకు... మీన మేషాలు..?

### ఇప్పుడు హాట్ టాపిక్ అంతా మైనంపల్లి హన్మంతరావుదే..

హైదరాబాద్, : భారత రాష్ట్ర సమితిలో ఇప్పుడు హాట్ టాపిక్ అంతా మైనంపల్లి హన్మంతరావుదే. ఆయన ఉద్దే శపూర్వకంగానే టార్గెట్ చేసినట్లుగా హరీష్ రావుపై కామెంట్లు చేస్తున్నారని.. దీని వెనుక బీఆర్ఎస్ అంతర్గత రాజకీయాల కోణం ఉందన్న చర్చలు జరుగుతున్నాయి. తిరుమలలో అలాంటి వ్యాఖ్యలు చేసిన తర్వాత కూడా మైనంపల్లికి టిక్కెట్ ప్రకటించారు. ఇప్పటికీ ఆయనపై చర్యలు తీసుకోలేదు. ఏ క్షణమైనా సస్పెండ్ అనే లీకులు వస్తున్నాయి. ప్రత్యామ్నాయ అభ్యర్థిపై కసరత్తు చేస్తున్నా రని చెబుతున్నారు. కానీ ఆయన సైలెంట్ గా ఉంటే అంతా సర్దుకుపోతుందని బీఆర్ఎస్‌లోని ఓ వర్గం గట్టి నమ్మకంతో ఉంది. బీఆర్ఎస్ సోషల్ మీడియా టీం కూడా మైనంపల్లికి వ్యతిరేకంగా పోస్టులు ఆపేసింది.

# సాయి జీనియస్ స్కూల్ విజయోత్సవ ర్యాలీ



**కోరుట్ల టౌన్ ఆగస్ట్ 24 (ప్రజామంటలు )**

సాయి జీనియస్ హై స్కూల్ కోరుట్ల భీముని దుబ్బ ప్రాంతంలో గల పాఠశాల విద్యార్థులు ఈ నెల 23వ తేదిన దేశం గర్వించదగ్గ చంద్రయాన్ -3విజయవంతంగా చంద్రుని దక్షిణ దిశగా సురక్షితంగా దిగినందుకు ఇస్రో శాస్త్రవేత్తలకు కృతజ్ఞత పూర్వక అభినందనలు తెలుపుచూ కొత్త మున్సిపల్ వద్ద నుండి అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీ నిర్వహించి బానాసంచ పేల్చి వారి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చౌకి రమేష్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు చేయలేని పనిని మన భారత దేశ శాస్త్ర వేత్తలు చేసి చూపించారని ఎవరు చేయని పనిని మనం చేసినప్పుడే మనలో ఆత్మ విశ్వాసం పెరుగుతుందని అన్నారు. విద్యార్థులు తమ చదువులను వృధా చేయకుండా ఇలాంటి గొప్పనైన పనులకు తమ విజ్ఞానాన్ని వినియోగించు కోవాలని మన దేశ శాస్త్ర వేత్తలను స్ఫూర్తి గా తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి ఆవిష్కరణలు మీ ద్వారా రావాలని సూచనలు ఇచ్చారు. మన దేశం ఇలాంటి ఎన్నో ఆవిష్కరణలకు నాంది పలకాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చౌకి సుధ మరియు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు మళ్లీ టిక్కెట్టు రావడంపై హర్షం

## - పొలస్తేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**జగిత్యాల ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**

జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ కు మళ్ళీ టికెట్ కేటాయించిన సందర్భమును పురస్కరించుకొని పొలాస శ్రీ పౌలస్తేశ్వర స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ మర్రిపెల్లి కొండల్ రావు మరియు పాలక వర్గం ఆధ్వర్యంలో స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండోసారి మల్లి గెలవాలని స్వామిని ప్రార్ధించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రంగు రాజయ్య, భారతపు భూమయ్య, రాజలింగం, షేర్ల మహేష్, అటుకుల తిరుపతమ్మ, గుండేటి బేబీ రాణి రాజు, మేనేజర్ కొంద్ర రవి, పూజారులు గోవర్ధన్, గోపాల్ పాల్గొన్నారు.

# ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

## - ఈద్గా కు ఐదు లక్షల ప్రొసీడింగ్స్ అందజేత పాల్గొన్న ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యా సాగర్ రావు డా. కల్వకుంట్ల సంజయ్



**కోరుట్ల ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**

కోరుట్ల పట్టణంలోని అల్లమ్మయ్య గుట్ట వద్ద గల ఈద్గా అభివృద్ధికి ఐదు లక్షల ప్రొసీడింగ్సు్ని ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.... ముస్లిం మైనార్టీ వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న బీఆర్ఎస్ నాయకులు డా. సంజయ్ మాట్లాడుతూ.... ముస్లిం మైనార్టీ వర్గాల సంక్షేమానికి కృషి చేస్తానని వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అన్నం అనీలు, కౌన్సిలర్ సజ్జు, ముస్లిం పెద్దలు మరియు నాయకులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ ట్రాఫిక్ పోలీసుల కౌన్సిలింగ్‌తో మారిన నడిపి మల్లయ్య




**జగిత్యాల ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**

జిల్లా ఎస్పీ భాస్కర్ ఆదేశాలతో ట్రాఫిక్ పోలీసులు జిల్లా కేంద్రంలో గత 15 రోజుల క్రితం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా బండారి నడిపి మల్లయ్య అనే రైతు పోలీసుల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడడంతో పోలీసులు అతని కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇదిలా ఉండగా బండారి నడిపి మల్లయ్య పోలీసులు ఇచ్చిన కౌన్సిలింగ్ కు స్ఫూర్తి పొంది గురువారం జగిత్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ చేరుకొని ట్రాఫిక్ ఎస్ఐ, ఏఎస్సై లను కలిసి గత 15 రోజుల క్రితం ట్రాఫిక్ ఎస్ఐ నిర్వహించిన కౌన్సిలింగ్ తో తనకు కనువిప్పు కలిగిందని ఇప్పటి నుండి తాగి వాహనాన్ని నడపనని ట్రాఫిక్ ఎస్ఐ ముందు తన అభిమతాన్ని తెలియజేశాడు. అంతేకాకుండా పోలీస్ స్టేషన్లో ట్రాఫిక్ ఎస్ఐ రామచంద్రం తనకు తాగి బండి నడపడం వల్ల జరిగే అనర్థాలను తెలిపి తనకు కౌన్సిలింగ్ (హితబోధ) చేశారని దీంతో తాను ఒక నిశ్చితమైన అభిప్రాయానికి వచ్చి ఇకముందు తాను తాగి వాహనం నడపనని నిర్ణయించుకున్నట్లు తెలిపి ట్రాఫిక్ ఎస్ఐ రామచంద్రం మరియు ట్రాఫిక్ ఏఎస్ఐ సంధాని లను నడిపి మల్లయ్య శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్.ఐ. రామచంద్రం మాట్లాడుతూ%®ౌ%. తాము నిర్వహించిన కౌన్సిలింగ్ ద్వారా ఒక వ్యక్తి వైఖరిలో మార్పు రావడం అభినందించదగిన విషయమని తెలుపుతూ జగిత్యాల కు చెందిన రైతు బండారి నడిపి మల్లయ్య ను ట్రాఫిక్ ఎస్సై సైతం సత్కరించారు. ఎస్పీ ఆదేశాలతో నిర్వహించిన ఈ ప్రయత్నం ద్వారా వ్యక్తిలో మార్పు రావడం ఆనందదాయకం అన్నారు. ప్రతి ఒక్కరూ తాగి వాహనం నడపడం వల్ల జరిగే అనర్థాలను గుర్తించి తాగి వాహనాలు నడపరాదని ఆయన హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు లక్ష్మీ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

# సీట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం జరిగితే సహించం

**జగిత్యాల ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**

రాజకీయ పార్టీలు టికెట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం జరుగుతూనే ఉందని ఈసారి అన్ని రాజకీయ పార్టీలు 50 శాతం సీట్లు కేటాయించాలని లేని పక్షంలో బీసీల సత్తా ఏంటో ఓటు ద్వారా చూపిస్తామని బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్చరించారు. ఈ మధ్య ఒక పార్టీ 64 శాతం మంది ఉన్నా బీసీ లకు 20 శాతం సీట్లు, 8 శాతం ఉన్న అగ్రవర్ణాలకు 54 శాతం ప్రాధాన్యత కల్పించిందని ఇది ఎంతవరకు సమంజసమని వారన్నారు. బీసీ జాబితాలో 136 కులాలకు గాను 5 కులాలకే పరిమితం చేశారని వివరించారు. ఇంత వరకు మిగతా కులాల్లో ముదిరాజ్, విశ్వబ్రాహ్మణ, కుమ్మరి, కురుమ, మేదర, రజక, వడ్డెర, నాయి బ్రాహ్మణ, సగర వంటి కులాల్లో సంఖ్యాపరంగా ఉన్నప్పటికీ ఇందులో చాలా కులాలు అసెంబ్లీ మెట్లు కూడా ఎక్కలేదని వాపోయారు.?? మహిళా సాధికారత కోసం మహిళ బిల్లు పెట్టాలని పోరాటం చేస్తున్న పార్టీలు కూడా మహిళలకు అన్యాయం చేశారని వేళ్ళ మీద లెక్కపెట్టే సీట్లు మాత్రమే మహిళలకు కేటాయిస్తే అందులో కూడా ఒక బీసీ మహిళకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం విడ్డూరమని వారన్నారు. బీసీలకు జరిగిన అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని,



బడుగులకు అన్యాయం చేస్తున్న పార్టీలకు బుద్ధి చెబుతామని, మాకు జరిగిన నష్టానికి తిరిగి ఓటు ద్వారా సమాధానం చెప్పేందుకు ప్రజలను ప్రభావితం చేసి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని, బీసీలకు సముచిత స్థానం కల్పించే పార్టీలకే అండగా ఉంటామని ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి చింతల గంగాధర్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు తిరుపురం రామచందర్, పట్టణ అధ్యక్షులు రాపర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

# రత్న తండా కు వెంటనే బీటీ రోడ్డు వెయ్యాలి



**నర్మెట్ట ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**

మండల కేంద్రంలోని ఇప్పలగడ్డ గ్రామపంచాయతీ పరిధిలోని రత్న తండావాసులు తండ రోడ్డు కోసం నిరసన తెలుపరు. అనంతరం తండావాసులు మాట్లాడుతూ.... గత 20 సంవత్సరాలుగా తండకు రోడ్డు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. గతంలో చాలా సార్లు ఎమ్మెల్యేకు ,కలెక్టర్ కు, ఎంపీడీవో, ఎమ్మార్వో, సర్పంచ్, ఎంపీపీ, జడ్పిటిసి,స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని అన్నారు. ఏమైనా అకస్మాత్తుగా ప్రమాదం జరిగితే కనీసం అంబులెన్స్ రాని పరిస్థితి, ఆరు కాలాలు కష్టపడి పండించిన పంటను మార్కెట్ కు తీసుకెళ్లలేని పరిస్థితి చిన్నపిల్లలు స్కూలుకు వెళ్లలేని పరిస్థితి కనీసం ఆటోలు కూడా రావు కాలినడకనే వెళ్లి రావాలి. ఇంట్లో నిత్యవసర సరుకులు పంటలకు ఎరువులు తీసుకురావాలన్న అనేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. గతంలో ఎమ్మెల్యే స్థానిక టిఆర్ఎస్ నాయకులు 2018 ఎలక్షన్ ప్రచారంలో భాగంగా మా తండకు వచ్చి మా గుడి ముందు తను ప్రమాణం చేసి మాతో ప్రమాణం చేయించి నాకు ఓట్లు వేస్తే నేను గెలిచినా వెంటనే సంవత్సరం లోపు రత్న తండకు బీటీ రోడ్డు వేపిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కానీ ఇంతవరకు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి రెడ్డి యాదగిరి రెడ్డి పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని అన్నారు. వెంటనే రత్న తండా కు రోడ్డు వేయకపోతే రాబోయే ఎన్నికల్లో మేమేంటో చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రతాప్ సల్మాన్ రెడ్డి రాజు నాయక్ బిజెపి నర్మెట్ట మండల అధ్యక్షుడు దరావత్ రాజు నాయక్, రత్న తండా గ్రామవాసులు రమేష్, కాల్ రాం, బాలు ప్రవీణ్, చంద్రు, సక్రు, పంతులు, దుదియా, రెడ్యా, హనుమంతు, రాజూ, తుకారం భీమ్లా చందర్ మంగ్యా అంజి, రత్న, మహేందర్, హరి సింగ్, మోహన్, లాలు, నరేష్ రాజేష్, రాకేష్, శాంతమ్మ, బూలి, పద్మ, లక్ష్మి, రక్కమ్మ, విజయ, పునీ, లలిత, రాజమణి, లక్ష్మి, తారమ్మ, సత్తమ్మ, రుక్క సరిత, రమా, బద్రి కమలమ్మ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలి

**జగిత్యాల ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**

విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉంటే రానున్న రోజుల్లో జిల్లాలో ఎలాంటి రోడ్డు ప్రమాదాలు సంభవించకుండ ఉంటాయని ఒక మంచి ఉద్దేశంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, ట్రాఫిక్ గుర్తులు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని ఈ రోజు ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు మోటర్ వాహనాల చట్టం గురించి పోలీస్ చట్టాల గురించి తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు విద్యార్థి దశ నుండే అలవర్చుకోవడం వల్ల రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చు అని రోడ్డు పై ప్రయాణం చేసేటప్పుడు తప్పకుండా హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించ లని ఖచ్చితంగా ట్రాఫిక్ నియమాలను పాటించినట్లయితే చాలా వరకు రోడ్డు ప్రమాదాలు అరికట్టవచ్చు అని తెలియ చేయడం జరిగింది. త్రిబుల్ రైడింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపే వారికి డాక్యుమెంట్స్ లేకుండా వాహనాలు నడిపే వారికి, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి, ఈ- చాలన్ ద్వారా ఫైన్ లు వేయడం జరుగుతున్నదని తెలిపినారు. మైనర్ గా ఉన్నప్పుడు వాహనాలను నడప రాదని వాహనాలు నడిపేటప్పుడు ఏదైనా ప్రమాద సంభవిస్తే తల్లిదండ్రులతో పాటు నడిపిన వారిపై కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రొజెక్టర్ ద్వారా ట్రాఫిక్ నియమాలకు సంబంధించిన వీడియోలను చూపించడం జరిగింది. అనంతరం ట్రాఫిక్ ఇన్స్టిట్యూట్ లో గల ట్రాఫిక్ గుర్తులను, సిగ్నల్స్ యొక్క ఉపయోగాలను విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్.ఐ రామచంద్రం, ఆర్ఎస్ఐ కృష్ణ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, 60 మంది విద్యార్థులు, పాల్గొన్నారు.

# జనగామలో చంద్రయాన్ -3 విజయం భారీ జాతీయ జెండాతో సంబరాలు




**జనగామ ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**

భారత దేశంలో ఉన్న 140 కోట్ల మంది ప్రజలు గర్వించే చంద్రయాన్ -3 విజయం సాధించిన సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలో హెర్త్ ఫౌండేషన్, మేము సైతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనగామలో భారీ జాతీయ జెండాతో ఇస్రో చంద్రయాన్ -3 విజయ సంబరాలు జరుపుకున్నారు. 50 మీటర్ల జాతీయ జెండా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి పాల్గొని ప్రారంభించారు. జనగామ ప్రిస్టన్ గ్రౌండ్ నుండి గాంధీ విగ్రహం వరకు జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించి ఇస్రో చంద్రయాన్ -3 కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెర్త్ ఫౌండేషన్ డైరెక్టర్ మంగళంపల్లి రాజు, టిజివిపి జిల్లా అధ్యక్షుడు గన్ను కార్తీక్, మేము సైతం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు తుంగ కౌశిక్, ఎలక్ట్రీషియన్ సంఘం అధ్యక్షులు రంగు ప్రవీణ్, కార్యదర్శి ఎం.డి.అబ్బాస్, కడకంచి మల్లేష్, టిజివిపి పట్టణ అధ్యక్షుడు వెంపటి అజయ్, గిరిజన విద్యార్థి నాయకులు అనిల్ చౌహాన్, ప్రపంచ రికార్డు గ్రహీత రుద్ర, వైష్ణవీ పాఠశాల ప్రిన్సిపల్ ఇన్నరెడ్డి, వైష్ణవీ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి గుగ్గిల్ల నర్సయ్య పరామర్శ, సహాయం



**జనగామ ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**

జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం లింగాలఘనపురం మండలం నేలపోగుల గ్రామంలో ఇటీవల హఠాన్మరణం చెందిన చిర్ర రాంమల్లయ్య కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా వంద కేజీల బియ్యాన్ని కాంగ్రెస్ పార్టీ సంస్కృతిక సేన రాష్ట్ర కార్యదర్శి నేలపోగుల ఎంపీటీసీ గుగ్గిల్ల నర్సయ్య అందించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ సభ్యులు జోగురాజు ,ఉప సర్పంచ్ ఆవుల ఎల్లమ్మ, వార్డు గుగిల్ల యాక లక్ష్మి, అబ్బసాయిలు, సీనియర్ నాయకులు ఆకుల సత్తయ్య, గొల్ల కొమురయ్య, కందగట్ల భాస్కర్, యూత్ నాయకులు గైని ప్రవీణ్, ఆవుల హరీష్, ఆకుల సాయి, గొల్లనకొండ నాగరాజు, ఆకుల యాకన్న, సముద్రాల శ్రీనివాస్, గుగ్గిల్ల ఎల్లేష్, గుగ్గిళ్ళ నాగరాజు, పల్లటి మహేందర్ పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా తిరుపతి

**జగిత్యాల ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**



భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పడాల తిరుపతిని నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి. కిషన్ రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో బిజెపి బలోపేతానికి కృషిచేస్తున్న తిరుపతి సేవలు రాష్ట్ర పరిధిలో అవసరమని భావించిన రాష్ట్ర పార్టీ ఈ నియామకాన్ని చేపట్టినట్లు తిరుపతి పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన ఎంపీ అర్వింద్, జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ రావులకు ఈ సంధర్భంగా తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు.

# చంద్రయాన్ 3 వీడియోను వీక్షించిన జిల్లా పరిషత్ పైడిమడుగు విద్యార్థులు



**కోరుట్ల రూరల్ ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**

"ఫెయిల్యూర్ ఈజ్ ద హైవే టు సక్సెస్" గా సాగిన చంద్రయాన్ 3 చంద్రుని పై లాండింగ్ విజయయాత్రను జిల్లా పరిషత్ హై స్కూల్ పైడిమడుగు పాఠశాల విద్యార్థులందరూ మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా పాఠశాలకు అందించిన 72 ఇంచుల టివి ద్వారా విద్యార్థులందరూ వీక్షించడం జరిగింది చంద్రయాన్- 2 లో పలు రకాలైనటువంటి ఫెయిల్యూర్ను దృష్టిలో పెట్టుకొని ఇస్రో జూలైలో ప్రవేశపెట్టినటువంటి చంద్రయాన్-3 ఈరోజు విజయవంతం కావడం ప్రపంచంలో మనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన ఇస్రో సైంటిస్టులకు, భారత ప్రధానమంత్రికి ,ప్రజలందరికీ ,పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రాజెక్ట్ ని ప్రపంచంలోనే అతి తక్కువ వ్యయముతో దాదాపుగా 700 కోట్ల రూపాయలతో తక్కువ ఖర్చుతో చంద్రుని చేరుకోవటం మేడిన్ ఇండియా లో భాగమే. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి వెంకటరాజం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్యభట్ట స్కూల్లో చంద్రయాన్ 3 విజయోత్సవాలు



**జనగామ ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**

శాశ్వత చిరస్థాయిగా గుర్తుండిపోయే విజయాన్ని అందుకున్న చంద్రయాన్-3 ప్రయాణాన్ని ఆద్యంతం జనగామ బస్టాండు చౌరస్తాలోని ఆర్యభట్ట స్కూల్లో పాఠశాల ప్రాంగణంలో ఎల్ఈడి స్క్రీన్ పై వీక్షించిన విద్యార్థులు విజయోత్సాహంలో మునిగితేలారు. ఈ ఘనతను పాఠశాలల్లో విద్యార్థులు వీక్షించేలా పాఠశాల యజమాన్యం చర్యలు తీసుకుంది. పాఠశాలల్లో స్మార్ట్ టీవీ స్క్రీన్స్ పై ప్రసారం. ఆద్యంతం వీక్షించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, చంద్రునిపై ల్యాండర్ మాడ్యూల్ దిగిన వీడియోని చూస్తూ విద్యార్థులు వెంటనే కేరింతలు, చప్పట్లు భారత్ మాతాకీ జై అని నినాదాలు. ఇస్రో శాస్త్రవేత్తలకు సలామ్ అంటూ పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ స్రుజనా చంద్ర, కరెస్పాండెంట్ సృజన్ చంద్ర, ఉపాధ్యాయులు మనోజ్, వెంకన్న,కుమార్, శ్రీనివాస్, సంతోష్, మహేష్, మాధవరావు, నవీన్, హరికుమార్ పాల్గొన్నారు.





హైదరాబాద్‌లో రాజ్యసభ సభ్యులు దీవకొండ దామోదర్ రావు ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి జగిత్యాల నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం ఎంపీ నిధుల నుండి నిధులు మంజూరు చేసినందుకు వారిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. మాజీ పార్లమెంట్ సభ్యులు ప్రస్తుత రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బి. వినోద్ కుమార్ ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్.

## అంతర్జాతీయ వేదికపై భారత త్రివర్ణ పతాకం రెపరెపలాడించిన రంగు విరించి స్వప్నిక కు భారత జాగృతి సన్మానం



షార్జా (దుబాయ్) లో ఆగస్టు 16-21 వరకు జరిగిన ఆసియా యూనివర్సిటీ కప్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్) - 2023 84ం క్యాటగిరిలో బంగారు పతకం సాధించి ధర్మపురి పేరును చరిత్రలో ఎప్పటికీ మర్చిపోలేని రోజుగా నిలిపిన చి. రంగు విరించి స్వప్నిక ( రంగు వెంకటరమణ - శ్రీలత ల పుత్రిక ) కు నేడు ధర్మపురి పట్టణములో భారత జాగృతి ధర్మపురి మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా భారత జాగృతి నాయకులు మాట్లాడుతూ చిరంజీవి రంగు విరంచి స్వప్నిక రాబోవు రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించాలని దాని కొరకు కావలసిన సహాయ సహకారాలను, సదుపాయాలను భారత జాగృతి జాతీయ అధ్యక్షురాలు కవితక్క దృష్టికి తీసుకెళ్లి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత జాగృతి నియోజకవర్గ మహిళా కన్వీనర్ రాపర్తి విజయలక్ష్మి జిల్లా కోకన్వీనర్ సిరంగి సంతోష్ కుమార్ నియోజకవర్గ కన్వీనర్ కొంక సుధీర్ కుమార్ మండల శాఖ అధ్యక్షులు మ్యాన పవన్ కుమార్ మండల యువత అధ్యక్షులు కాసెట్టి విజయ్ భోగ శివప్రసాద్, సూరినేని వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక కారణాలవల్ల అర్హత కోల్పోయిన లబ్ధిదారులను డబల్ బెడ్ రూమ్ ఇండ్ల జాబితాలో చేర్చాలి

### - జిల్లా కలెక్టర్ కు చిన్నాపూర్ సర్పంచ్ దమ్మ లత శ్రీ విజ్ఞప్తి



**బుగ్గారం ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**

జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామంలో సాంకేతిక కారణాల వలన అర్హత కోల్పోయిన ఇండ్లు లేని అత్యంత నిరుపేద లైన 11 మంది లబ్ధిదారులను డబల్ బెడ్ రూమ్ ఇండ్ల జాబితాలో చేర్చాలని గురువారం జిల్లా కలెక్టర్ కు చిన్నాపూర్ సర్పంచ్ దమ్మ లత శ్రీ విజ్ఞప్తి చేశారు. సుంకే సురేష్, దమ్మ లక్ష్మి, గుంపుల శారద, బందేల జల, కలమడుగు కవిత, అలుస విజయ్, మద్దికుంట శంకరయ్య లకు ఎలాంటి ఇండ్లు లేవని, వీరి పేరున ఇల్లు ఉన్నట్లు ప్రభుత్వ ఆప్ ఆన్ లైన్ రికార్డులలో తప్పుగా నమోదు కావడం జరిగిందన్నారు. అలాగే ఒరుసు లక్ష్మి, రాచకొండ లావణ్య, రాసమల్ల లక్ష్మి, మిరియాల శ్యామల అను నలుగురు చిన్నపూర్ వాస్తవ్యులు అయినప్పటికీ సాంకేతిక కారణాల వలన వీరి రేషన్ కార్డులు ఇతర గ్రామాలలో నమోదైనట్లు ప్రభుత్వ ఆన్ లైన్ రికార్డులలో కలదు. ఈ రెండు సాంకేతిక కారణాల వలన ఈ 11మంది లబ్దిదారులు అర్హత కోల్పోయారు. కావున తక్షణమే తగు విచారణ జరిపి ఈ సాంకేతిక కారణాలను తొలగించి అర్హులైన డబల్ బెడ్ రూం ఇండ్ల జాబితాలో వీరి పేర్లను చేర్చాలని ఆమె జిల్లా కలెక్టర్ ను కోరారు. వీరి పేర్లను జాబితాలోకి చేర్చిన తరువాత నే డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీ ప్రక్రియ కొనసాగించాలని ఆమె జగిత్యాల జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

## జగిత్యాల అర్బన్ రూరల్ అంగన్వాడి టీచర్ల ప్రాజెక్టు స్థాయి సమావేశం

**జగిత్యాల ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**

ఐసిడిఎస్ ప్రాజెక్టు జగిత్యాల పరిధిలోని జగిత్యాల పట్టణం, అర్బన్, జగిత్యాల రూరల్, రాయికల్ మండలంలోని అంగన్వాడి టీచర్లకు గురువారం స్థానిక ఎల్.జి. గార్డెన్ లో ప్రాజెక్టు స్థాయి సమావేశం నిర్వహించనైనది. ఈ సమావేశములో జిల్లా సంక్షేమ అధికారి డా.బి. నరేష్ పాల్గొని అంగన్వాడి కేంద్రములలో ప్రీ-స్కూల్ విద్య సక్రమంగా షెడ్యూల్ ప్రకారం అందించాలని మరియు అంగన్వాడి టీచర్లందరు సమయపాలన పాటించాలని సూచించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా అంగన్వాడి టీచర్లకు పనిభారం తగ్గించుటకు గాను మరియు అంగన్వాడి సేవలు పటిష్టంగా అందించుటకు గాను రూపొందించిన పోషణ్ ట్రాకర్, ఎన్.హెచ్.టి.ఎస్ అప్లికేషనులో కేంద్రమునకు హాజరైన తల్లులు, పిల్లల వివరములు, పోషకాహారము వినియోగం ప్రతిరోజూ మరియు ప్రతి నెల పిల్లల బరువు, ఎత్తులు తీసి గ్రోత్ మానిటరింగ్ వివరములు ఆన్లైన్ నందు నమోదు చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తీసుకోబడునని సూచించారు. లోప పోషణతో ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోని పిల్లలలోని లోప పోషణ నివారించాలని అంగన్వాడి టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని యం. వీరలక్ష్మి, సూపర్వైజర్లు పద్మావతి, స్వరూపరాణి, భాగ్యలక్ష్మి, లావణ్య, రాధ, టైపిస్ట్ జీవన్, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ వి. మధుకుమార్, బ్లాక్ కోఆర్డినేటర్ ఎం. శ్రీధర్ మరియు అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## నోటిఫికేషన్ రద్దు చేసి, మమ్మల్ని రెగ్యులరైజ్ చేయాలి

### - తెలంగాణా ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధురిమ డిమాండ్

### - జీఓ కాపీలను ధ్వంసం చేసి ఏఎన్ఎంల నిరసన




**జగిత్యాల ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**

గత 16 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో కాలం వెళ్లదీస్తూ కష్టకాలం లోనూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న మహిళ ఏఎన్ఎం లను రాష్ట్ర ప్రభుత్వం పర్మనెంట్ చేయకపోవడం బాధాకరమని ఏఐటీయూసి అనుబంధ తెలంగాణా ఏఎన్ఎం ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ అన్నారు. సర్వీసును క్రమబద్ధీకరించాలానే డిమాండుతో గత 9 రోజులుగా జగిత్యాల ఆర్డీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తూ వివిధ రీతుల్లో ప్రభుత్వానికి నిరసన తెలియజేస్తున్నారు. గురువారం గాండ్ల మధురిమ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు గత నెలలో నోటిఫికేషన్ జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వుల కాపీలను ధ్వంసం చేస్తూ అంబెడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. అ%శీ%బేడ్కర్ చౌరస్తాలో అరగంట సేపు నిరసన చేసి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని తప్పుపట్టారు. ఈ కార్యక్రమంలో సుప్రియ, నీరజ, పద్మ, రాజమణి, మేరీ, ఎలిజబెత్, శిరీష, ప్రశాంతి, శైలజ, శిరీష, శారద, జమున, జయప్రద, చిలుకమ్మ, విజయలక్ష్మి, మహేశ్వరి, సుజాత, సరోజ, సుగుణ, ఊర్మిల, సమత, రాధ, ప్రశాంతి, సునీత, రమాదేవి, లక్ష్మీకాంత, రజిత, సౌజన్య, పుష్ప, స్వరూప, సుమలత, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : టీపీటీఎఫ్ డిమాండ్




**ధర్మపురి ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**

ధర్మపురి మండలంలోని నేరెళ్ల, తుమ్మెనాల, రాయపట్నం, తిమ్మాపూర్, ధర్మపురి మొదలగు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలను టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సమస్యలు సేకరించడంతోపాటు సభ్యత నమోదు గావించడమైనది. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు బోగ రమేష్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి నేటి వరకు 9 సం.ల్లో ప్రభుత్వం విద్యారంగం పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన పేరుతో అట్టహాసంగా ప్రారంభించిన మన ఊరు-మనబడి కార్యక్రమానికి 7200 కోట్లు కేటాయిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు సకాలంలో విడుదల చేయనందున అనేక పాఠశాలల్లో సకాలంలో పనులు నిర్వహించ లేకపోతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యారంగానికి 12 శాతం నిధులు కేటాయించగా, తెలంగాణ రాష్ట్రంలో 6 శాతం మాత్రమే బడ్జెట్ కేటాయిస్తూ విద్యారంగం పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని, గడచిన తొమ్మిది సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు లేక అనేకమంది ఉద్యోగ విరమణ చేస్తున్నారని కోర్టు కేసు విషయంలో, ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని పదోన్నతులకు చొరవ చూపాలని, సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పాఠశాలల్లో కనీసం సర్వీస్ పర్సన్ ను నియమించాలని, మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని, ఉపాధ్యాయుల సరెండర్, మెడికల్,జిపిఎఫ్,పిఆర్సి, డి.ఎ బిల్లులు నెలల తరబడి తరబడి పెండింగ్లో ఉంటున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడి ఉపాధ్యాయ-విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు చొరవ చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కార్యదర్శి అప్పాల గంగయ్య, మండల బాధ్యులు మొస్టీ రమేష్, ఆసం శ్రీనివాస్, గొడుగు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రయాన్- 3 విజయోత్సవ సంబరాలు



**ఎల్కతుర్తి ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**

చంద్రయాన్- 3 విజయోత్సవ సంబరాలను ఎల్కతుర్తి మండల కేంద్రంలో గల ఆల్టిట్యూడ్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యయులతో కలిసి విద్యార్థులు చంద్రయాన్-3 నమూనాను తయారు చేసి సంబరాలు జరుపుకున్నారు. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడం 140 కోట్ల భారతీయుల అందరికీ గర్వకారణమైన విషయమని చంద్రుని దక్షిణ ధృవంపై ఏ దేశము ప్రయోగించని విధంగా భారతదేశ శాస్త్రవేత్తలు కృషి చేసి చంద్రుని దక్షిణ ధృవంపై పరిశోధనలు చేయడానికి ఈ ప్రాజెక్టు విజయవంతం కావడం గర్వించ దగ్గ విషయం ఇది మన శాస్త్రవేత్తలకు వారి కృషికి చిరస్మరణీయ విజయం అని అమెరికా, చైనా రష్యాల తరువాత అంతరిక్ష ప్రయోగాలలో నాల్గవ స్థానం మనదేశం సాధించి ముందు ముందు అంతరిక్ష ప్రయోగాలలో ప్రథమ స్థానం సాధించడానికి మొదటి అడుగుగా మన భారత ప్రధాని నరేంద్ర మోడీ యొక్క ప్రోత్సాహంతో సాధించిన విజయం ఇదే స్పూర్తితో మన శాస్త్రవేత్తలు అంతరిక్ష రంగంలో అనేక విజయాలు సాధించాలని ఆల్టిట్యూడ్ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మృతుడు కుటుంబాన్ని సందర్శించిన జడ్పిటిసి భూక్యా మంగా శ్రీనివాస్



**అక్కన్నపేట ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**

అక్కన్నపేట మండలంలోని చౌటపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతు తుది శ్వాస విడిచిన యామ సాయి చరణ్ మరణ వార్త తెలుసుకున్న అక్కన్నపేట మండల జడ్పిటిసి భూక్యామంగా శ్రీనివాస్ చౌటపల్లి గ్రామానికి చేరుకుని యామ సాయిచరణ్ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి, సాయిచరణ్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండలం ఎంపీపీ మాలోతు లక్ష్మి బీలు నాయక్ చౌటపల్లి గ్రామ సర్పంచ్ గద్దల రమేష్, మహిళా అధ్యక్షురాలు శోభ, మాజీ జెడ్పిటిసి బీలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల కొరకు ప్రత్యేక వైద్య శిబిరం



**జమ్మికుంట ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**

జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలో గల వావిలాల ఖాదీ గ్రామోద్యోగు ప్రతిస్థాన్ బండారి లో గల చేనేత కార్మికుల కొరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సనజవేరియా ఆధ్వర్యంలోగురువారం ఆరోగ్య శిబిరం ఎన్ సి డి క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగింది, ఖాదీ గ్రామోద్యోగు ప్రతిస్థాన్ బండారి లో గల 60 మంది చేనేత కార్మికులకు ఆరోగ్య పరీక్షలు మరియు ఎన్ సిడి పరీక్షలు నిర్వహించడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరిసరాల పరిశుభ్రత సీజనల్ డిసీజెస్ (వర్షాకాలంలో సంభవించే వ్యాధుల) మీద కండ్ల కలక వ్యాధి మీద డ్రై డే మీద అవగాహన కల్పించడం జరిగింది,చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్న చేనేత కార్మికులకు మందులు ఇవ్వడంజరిగింది. అలాగే ప్రతి నెల 24వ తేదీన జరిగే టిబి నిక్షయ్ దివస్ సందర్భంగా టి బి మీద అవగాహన ర్యాలీ చేపట్టడం జరిగింది. ఇప్పటివరకు జమ్మికుంట మండలంలోని కొత్తపల్లి చేనేత సహకార సంఘం, జమ్మికుంట పట్టణంలోని చేనేత సహకార సంఘం లో వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో వావిలాల గ్రామ సర్పంచ్ జక్కని శ్రీలత, ఎంపీటీసీ మర్రి మల్లేశం, ఖాదీ గ్రామోద్యోగు ప్రతిస్థాన్ బండారి మేనేజర్ నాగమల్ల శ్రీనివాస్, ఎన్ సిడి స్టాఫ్ నర్స్ స్వప్న, ఆరోగ్య శాఖ సిబ్బంది సరస్వతి మరియు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఖగోళ విజ్ఞానాన్ని అధ్యయనం చేయాలి!

భారతీయ పురాణాలు, ఇతిహాసాలు, జ్యోతిష్య శాస్త్రాలు, వేదాల్లో అనేకమైన ప్రపంచ బౌగోళిక, ఖగోళ శాస్త్ర రహస్యాలు దాగివున్నాయి. వాటిని వెలికి అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. తాజాగా చంద్రయాన్‌తో ఈ అవసరం గుర్తించాలి. జ్యోతిష్య,గణిత శాస్త్రాల్లో ఉన్నరహస్యాలను శోధించాల్సి ఉంది. చంద్రయాన్‌తో భారత శాస్త్రవేత్తలు అద్భుత విజయం సాధించారు. చంద్రయాన్-2 వైఫల్యంతో శాస్త్రవేత్తలు కసిగా పనిచేసి విజయ తీరాలకు చేరారు. ఇది ఆషామాషీగా జరగలేదని గుర్తించాలి. ఎంతో సమర్థతతో పనిచేశారు. ఓపికతో పనిచేశారు. అందుకే విజయం సాధించారు. భారత్‌కు చందమామను చేరువ చేశారు. త్వరలోనే మానవులను కూడా పంపే ప్రయత్నాల్లో భారత శాస్త్రవేత్తలు విజయం సాధిస్తారనడంలో సందేహం లేదు. ఇంత క్లిష్టతరమైన యాత్రను సులువుగా పూర్తి చేసినట్లుగా గతంలో అమెరికా ప్రకటించుకోవడం ప్రపంచాన్ని మోసం చేయడమే. 60వ దశకంలో అమెరికా చంద్రుడిపై కాలు మోపినట్లు ప్రకటించుకుంది. ఆ తరవాత అడుగు కూడా పడలేదు. దీనికి కారణాలు చెప్పాలి. ప్రపంచానికి అమెరికా సంజాయిషీ ఇచ్చుకోవాలి. ఇకపోతే భారతీయ సంస్కృతితో చందమామకు విడదీయరాని బంధం ఉంది. చందమామ రావే.. జాబిల్లి రావే.. కొండెక్కి రావే..కోటిపూలు తేవే.. అని పాడుతూ..ఆకాశంలోని చందమామ ను చూపిస్తూ.. ప్రతి అమ్మా తన బిడ్డకుగోరుముద్దలు తినిపిస్తుంది. మానవ చరిత్ర యావత్తు చంద్రుడికి, భూమికి మధ్య విడదీయరాని సంబంధం కొనసాగుతూనే ఉంది. చంద్రుడి ఆకర్షణ శక్తి కారణంగా భూమి మీద సముద్రాలలో ఆటుపోట్లు ఏర్పడుతుంటాయి. అలలు ఎగసిపడుతుంటాయి.అంతేకాదు, భూమిపై అనేక నిశాచర జీవజాతుల మనుగడ చంద్రుడి వెన్నెలలోనే. అనేక నాగరికతలు చాంద్రమానం ఆధారంగానే పంచాంగాలను రచిస్తున్నాయి. భూమిపై జీవం ఏర్పడడానికి కావాల్సిన పరిస్థితులు ఉండడం కూడా చంద్రుడి వల్లే సాధ్యమైందంటాయి కొన్ని సిద్ధాంతాలు. వివిధ వాతావరణ వ్యవస్థలు జీవంపై ప్రభావం చూపడానికి కూడా భూమి చుట్టూ చంద్రుడి అసాధారణ కక్ష్యే కారణమన్న వాదనలు ఉన్నాయి... సాధారణంగా చంద్రుడిని చందమామ అని పిలుస్తూ ఉంటారు. రాత్రి దర్శనం ఇచ్చే చందమామను మనకు, మనసుకు దగ్గరి వాడిగా చెప్తూ ఉంటారు. అసలు చంద్రుడు మామ ఎలా అయ్యాడు? చంద్రుడిని మామ అని పిలవటం వెనుక కారణం ఏమిటి? అనేది చాలా మందికి కలిగే ఒక సందేహం. చాలామందికి చంద్రుడిని చందమామ ఎందుకు అంటారో తెలీదు. అన్నా అనో.. బాబాయ్ అనో ఎందుకు పిలవరు? వంటి సందేహాలు మాత్రం కలుగుతాయి. ఆ సందేహాలను నివృత్తి చెయ్యాలన్నా అసలు చందమామ కథ తెలియాలి. చంద్రుడిని మామా అని పిలవడానికి అనేక కారణాలున్నాయి. పౌరాణిక, భౌగోళిక, మతపరమైన కారణాల వల్ల చంద్రుడిని చందమామ అనే పిలుస్తాము.చంద్రుడిని లక్ష్మీదేవి సోదరుడిగా భావిస్తారు. లక్ష్మీదేవిని మనమందరం అమ్మగా భావిస్తాం.. కాబట్టి అమ్మకు సోదరుడైన చంద్రుడు మనకు మామ అవుతాడు. అందుకే మనం చంద్రుడిని చందమామ అని పిలుస్తున్నాం అని చెబుతున్నారు. ఇది పౌరాణిక, మతపరమైన కారణం. ఇంకా భౌగోళిక కారణాలు కూడా ఉన్నాయి. అంతేకాదు భౌగోళికంగా భూమికి ఏకైక ఉపగ్రహం చంద్రుడు. చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతూ ఉంటాడు. సహజంగా సోదరీ, సోదరుల మధ్య ఒకరి చుట్టూ ఒకరి తిరిగే అవినాభావ సంబంధం ఉంటుంది. భూమిని మనమందరం అమ్మ భావిస్తాం. అమ్మ అయిన భూమి చుట్టూ తిరుగుతున్నాడు. కాబట్టి అమ్మ సోదరుడు అయిన చంద్రుడు మనకు మామ అవుతాడు. ఇది భౌగోళిక కారణం. ఈ రెండు కారణాల వల్ల చంద్రుడిని చందమామ అని పిలుస్తూ ఉంటాం...ఇకపోతే మన పురాణాలు, జ్యోతిష్య శాస్త్రాల్లో ఖగోళ విషయాలు అనేకం ఉన్నాయి. వాటిని వెలికితీసి అధ్యయనం చేయాల్సి ఉంది. ఖగోళ పరిశోధనలకు ఇది ఎంతగానో దోహదం చేయగలదు. ఇక మనశాస్త్రవేత్తల కృషి ద్వారా భారత్ సగర్వంగా తలెత్తుకునేలా చేసింది. సురక్షితంగా విక్రమం చంద్రుడిని చేరుకుంది. చంద్రుడిపై ల్యాండింగ్ ఒక కీలక ఘట్టం మాత్రమే. విక్రమ్, ప్రజ్ఞాన్ రోవర్ చేయాల్సింది చాలా ఉంది. ల్యాండర్ విక్రమ్ నుంచి బుధవారం వేరుపడిన ప్రజ్ఞాన్ రోవర్ పని మొదలుపెట్టింది. ఈ మేరకు గురువారం ఉదయం ఇస్రో ట్విటర్ వేదికగా సమాచారం ఇచ్చింది. చంద్రయాన్-3 ల్యాండర్ నుంచి రోవర్ కిందికి దిగింది. చందమామపై భారత్ నడక సాగించిందని ట్విటర్‌లో వెల్లడించింది. ల్యాండర్, రోవర్ పనితీరు అద్భుతంగా ఉన్నాయని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ అన్నారు. విక్రమ్ ల్యాండర్ నుంచి ప్రజ్ఞాన్ ల్యాండర్ కిందికి దిగింది. అతిత్వరలోనే రెండు ఫొటోలు పంపించే అవకాశం ఉందని వివరించారు. భూమ్మీద ఒక పగలు 12 గంటలు. కానీ, చంద్రుడి మీద 14 రోజులు. అంటే 14 రోజులు పూర్తిగా వెలుగు. తర్వాత చీకటి. సోలార్ ప్యానెళ్ల ద్వారా శక్తిని పొందే విక్రమ్, ప్రజ్ఞాన్ చంద్రుడిపై పడే సూర్యరశ్మితో పనిచేస్తాయి. అది ఆగిపోయాక చంద్రుడిపై చీకటి నెలకొని ఉష్ణోగ్రత మైనస్ 180 డిగ్రీలకు పడిపోతుంది. ఈ వ్యవధిలో మనుగడ కష్టమే. అయితే, 14 రోజుల తర్వాత చంద్రుడిపై సూర్యోదయం అయ్యాక.. విక్రమ్, ప్రజ్ఞాన్ సూర్యరశ్మి పడి తిరిగి పనిచేయడం మొదలుపెడితే గొప్ప ప్రయోజనమని ఇస్రో చెబుతోంది. ముఖ్యంగా ల్యాండర్ విక్రమ్ యాక్టివేట్ అయితేనే భూమికి సంకేతాలు చేరతాయి. మొత్తంగా అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ చరిత్ర సృష్టించింది. రోదసిలో ఇప్పటివరకు ఏ దేశమూ అందుకోలేకపోయిన లక్ష్యాన్ని ఇస్రో విజయవంతంగా చేరుకుంది. జాబిల్లిపై విక్రమ్ ల్యాండ్ అయిన కొన్ని గంటల తర్వాత దాని లోపలి నుంచి ప్రజ్ఞాన్ రోవర్ బయటకు వచ్చింది. ఈ విషయాన్ని భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం వెల్లడిం చింది. చంద్రునిపైకి ఇప్పటికే అమెరికా, యూఎస్ఎస్ఆర్, చైనా రోవర్లను పంపాయి. కానీ, వీటిలో ఏ దేశమూ దక్షిణ ధ్రువ ప్రాంతంలో దిగలేదు. మొట్టమొదటిసారి భారతదేశమే ఆ ఘనత సొంతం చేసుకొన్నది. మొత్తంగా చంద్రుడిపై అంతరిక్ష పరిశోధన మాడ్యూల్‌ను సురక్షితంగా దింపిన నాలుగో దేశంగా అవతరించింది.



## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్ " లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు....

-ఎడిటర్

## మేలు చేసిన మేలు....



ఇది చాలాకాలం నాటి సంఘటన. ఆ కాలంలో మరో ఊరు వెళ్ళాలంటే కాలినడక తప్ప మరో మార్గం లేదు. ధనవంతులైతే గుర్రపు బండి మీదో, గాడిద మీదనో ప్రయాణం చేస్తారు. కటియార్ అనే వ్యక్తి ఉద్యోగ వేటలో ఉన్నాడు. ఆ పని మీద కాన్పూర్ నుండి లక్నో నగరం వెళ్ళవలసి వచ్చింది. చద్దిమూట కట్టుకుని బయలు దేరాడు. సాయంత్రానికి లక్నో చేరవచ్చు అనుకున్నాడు.

మార్గమధ్యంలో ఇతడికి శుక్ల అనే వ్యక్తి కలిశాడు. ఇద్దరూ పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ నడుస్తున్నారు. సూర్యుడు అస్తమించాడు. మామూలుగా అయితే ఈపాటికి లక్నో చేరాలి. కానీ, కను చూపుమేరలో ఎక్కడా ఊరు ఉన్న దాఖలా కనిపించలేదు. దారి తప్పినట్టు తెలుసుకున్నారు. ఎటు వెడితే ఏమి వస్తుందో తెలియని అయోమయ పరిస్థితిలో పడ్డారు. మొండి ధైర్యంతో ముందుకు కదిలారు.

చీకటి పడింది. పిండి ఆరబోసినట్టు వెన్నెల కాస్తోంది. దారి బాగా కనిపిస్తోంది. కానీ చలికాలం కావటంవల్ల చలి మాత్రం దంచేస్తోంది. అది క్రమేణా పెరుగుతూ ఉంది. వారు చలికి తట్టుకోలేక పోతున్నారు. గడగడ వణుకుతున్నారు. శరీరం బిగుసుకు పోతోంది. ఇక చావటం ఖాయం అనుకున్నారు.

దారిలో వారికి అపస్మారక స్థితిలో పడి ఉన్న ఓ వ్యక్తి కనిపించాడు. అతడు చలికి తట్టుకోలేకనే పడిపోయి ఉన్నాడు. దాదాపుగా వారి స్థితి కూడా అప్పుడు అలాగే ఉంది.

"ఇప్పుడు ఏం చేద్దాం" అన్నాడు కటియార్.

"చేసేదేముంది... మన ఆయుష్షు ఇంతే.... ఇక్కడ దిక్కులేని చావు చావడమే" అన్నాడు శుక్ల.

"అది సరే... ఇతడిని మోసుకుపోదామా?..."

"సరి... సరే... 'తాను దూర సందు లేదు, మెడకో డోలు' అన్నట్టు మన చావు నిశ్చయమైంది. మళ్ళీ ఇతడిని మోసుకుపోవడమేమిటి"

"మిత్రమా! చావడం ఖాయం అంటున్నావు. చనిపోయే ముందు అయినా ఒక పుణ్యకార్యం చేద్దాం"

"పుణ్యం సంగతి దేవుడెరుగు... ముందు పదవయ్యా... ఏదో ఒక ఊరు వస్తుంది"

"నేను రాలేను. ఇతడిని వదిలి కదలలేను. మోసుకువస్తాను. చస్తే మేం ఇద్దరం చస్తాం....

"సరే... నీ ఇష్టం... నేను మాత్రం వెళ్తున్నా" గబగబా వెళ్ళాడు శుక్ల.

కటియార్ ఇతడిని భుజాన వేసుకున్నాడు. భగవంతుని స్మరిస్తూ ప్రార్థన చేసుకుంటూ నడక సాగించాడు. బరువు మోయడం వలన అతడికి శ్రమ కలిగింది. దీనితో శరీరం వేడెక్కింది. ఆ వేడి భుజం మీద ఉన్న వ్యక్తికీ పాకింది. అతడు కళ్ళు తెరిచాడు. విషయం గ్రహించాడు. కృతజ్ఞతలు తెలిపాడు.

తన పేరు చందు అని చెప్పాడు. అతడికి ఆ మార్గం బాగా తెలుసు. ఇద్దరూ కలిసి నడక మొదలుపెట్టారు. మార్గ మధ్యంలో వారికి చనిపోయి పడి ఉన్న శుక్ల కనిపించాడు. ఇద్దరూ సమీప గ్రామంలోని చందు ఇంటికి వెళ్ళారు. చందు ఆ గ్రామ పెద్ద. చేసిన మేలుకు కటియార్ కు లక్నోలోని మిత్రుని ఫ్యాక్టరీలో మంచి ఉద్యోగం ఇప్పించాడు.

– డా.దార్ల బుజ్జిబాబు

## తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మగ్దూం మొహియుద్దీన్

### ఆగస్టు 25...మగ్దూం మొహియుద్దీన్ వర్ధంతి




హైదరాబాద్ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచమంతా గర్వించేలా, గౌరవించేలా తన గళం (ఉపన్యాసం) తోనూ, కలం తోనూ ప్రచారం చేసిన గొప్ప వ్యక్తి మగ్దూం మొహియుద్దీన్. భారత దేశంలో వచ్చిన ప్రగతి శీల రచయితల ఉద్యమానికి హైదరాబాద్‌లో జీవం పోసింది మఖ్దుమే. నాలుగు దశాబ్దాలకు పైగా కమ్యూనిస్టు ఉద్యమాలకు, సాహిత్య సృజనకు తన జీవితాన్ని అంకిత మిచ్చాడు. మొక్కవోని ధైర్యంతో కులమతాల కతీతంగా పేదల పక్షాన నిలిచి వారి అభ్యున్నతికి ఆయన కృషి చేశాడు. మగ్దూం మొహియుద్దీన్ ప్రముఖ అధ్యాపకుడు, ఉర్దూ కవి. 'షాయరే ఇంక్విలాబ్' (ఉద్యమ కవి, విప్లవ రచయిత) బిరుదాంకితుడు. కవియే గాక నాటక కర్త, గాయకుడు, నటుడు కూడా. ఆయన గజల్ లు, పాఠ్యాంశాల లోను, సినిమాల లోనూ ఉపయోగించాడు. ఆయన రాసిన 'ఏ జంగ్ హై జంగే ఆజాదీ' 'ఎక్ చంబేలీకె మండ్వే తలే' అనే గీతాలు ప్రసిద్ధి పొందాయి. ఉర్దూ మహా కవిగా ప్రపంచాన్ని ఉర్రూత లూగించాడు. మగ్దూం మొహియుద్దీన్ తెలంగాణ లోని మెదక్ జిల్లా ఆందోల్లో 1908, ఫిబ్రవరి 4 న జన్మించాడు. ఆయన పూర్తిపేరు అబూ సయీద్ మహ్మద్ మఖ్దూమ్ మొహియొద్దీన్ ఖాద్రి. అయన పూర్వీకులు ఉత్తర ప్రదేశ్ లోని ఆజంగఢ్‌లో ఉండేవాడు. ఆయన తాత (తల్లితండ్రి) రషీదుద్దీన్ ఔరంగజేబు సైన్యాలతో పాటు దక్కన్ పీఠభూమికి వచ్చాడు. అలాగే, మరో తాత (తంవూడికి తండ్రి) సయ్యద్ జాఫర్ అలీ కూడా ఉత్తర ప్రదేశ్ షాజహానా బాద్ నుండి 1857లోనే దక్షిణానికి వచ్చాడు. ఆ కుంటుంబ మంతా హైద్రాబాద్ దక్కన్ పరిసరాలకు చేరింది. ఆయన తండ్రి గౌస్ మొహియొద్దీన్ నిజాము ప్రభుత్వంలో సూపరింటెండెంటుగా పని చేసేవాడు. బతకడానికి పెయింటింగ్స్, సినిమా తారల ఫొటోలు అమ్మాడు. ట్యూషన్లు చెప్పాడు, పత్రికల్లో పనిచేశాడు. ఆయన రాసిన 'గోథే ప్రేమ లేఖలు' 'మక్తబా' అనే స్థానిక ఉర్దూ పత్రిక అచ్చు వేసింది. నాగపూర్ కామ్రేడ్ల సహాయంతో 1930-40లలో హైద్రాబాద్‌లో 'స్టూడెంట్స్ యూనియన్' ప్రారంభించాడు. 1940లో తన సహచరులతో కలిసి కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. చంద్రరాజేశ్వర రావు, గులాం హైదర్, రాజ బహుదూర్ గౌర్, హమీద లీ ఖాద్రీ లాంటి నాయకులతో కలిసి పని చేస్తుండేవాడు. అక్తర్ హుస్సేన్ రాయ్‌పురి, సిబ్తె హసన్‌లతో కలిసి హైద్రాబాద్‌లో 'అభ్యుదయ రచయితల సంఘం' స్థాపించాడు. సరోజినీ నాయుడు నివాసమైన గోల్డెన్ త్రెషోల్డ్లో డాక్టర్ జయసూర్య, జె.వి.నరసింగరావు లతో కలిసి సాహిత్య, సామాజిక, రాజకీయ అంశాలపై చర్చలు జరుపుతుండేవాడు. చార్మినార్ సిగట్ ఫ్యాక్టరీ, బట్టల గిర్నీ, అల్విన్, షాబాద్ సిమెంట్, ఎన్ ఎస్సార్ రైల్వే ఎంప్లాయిస్, ఎలక్ట్రిసిటీ, సి.డబ్ల్యు.డి. మున్సిపాలిటీ, బటన్ ఫ్యాక్టరీ వంటి వందల కంపెనీల్లోని కార్మిక సంఘాలకు మఖ్దూమ్ అధ్యక్షుడయ్యాడు. అహెూ రాత్రులు వారి సంక్షేమం కోసం కృషి చేశాడు. స్టేట్ అసెంబ్లీలో మాట్లాడినా, బయట కార్మిక సంఘాలలో మాట్లాడినా ఆయన వాగ్ధాటికి ఎదురుండేది కాదు. విషయం సూటిగా, స్పష్టంగా, దృఢంగా, బలంగా చెప్పేవాడు. నల్లగొండ జిల్లా హుజూర్ నగర్ నుండి శాసనసభకు ఎన్నికయ్యాడు. 1957లో మెదక్ నుండి పార్లమెంట్‌కు పోటీ చేసి ఓడి పోయాడు. శాసన మండలికి ఎన్నికై 1969లో కన్నుమూసే దాకా కమ్యూనిస్టు నేతగా ఆ పదవిలో కొనసాగాడు.

మఖ్దూం కార్మిక నాయకుడు, శాసన మండలి సభ్యుడు. ఫాసిజానికి వ్యతిరేకంగా సమ సమాజ స్థాపన కోసం క్రియాశీలంగా రాజకీయాల్లో పాల్గొన్నాడు. ప్రగతిశీల భావాలతో పీడితుల పక్షాన కలమెత్తి నమ్మిన సిద్ధాంతానికి జీవితాన్నంకితం చేసి అమరుడైనాడు. కమ్యూనిస్టు అయిన మతాన్ని దూషించ లేదు, అనుసరించ లేదు. హైద్రాబాద్ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ శాఖకు తొలి కార్యదర్శి. నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన ప్రపంచ ప్రసిద్ధ తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్య పాత్రధారి. సాయుధ పోరాటానికి ముందు కారాగార శిక్షలు, పోరాటం తర్వాత అజ్ఞాత వాసం. హైద్రాబాద్ రాష్ట్ర శాసన సభ్యుడు (1952) శాసన మండలి సభ్యుడు, ప్రతిపక్ష నేత (1956-1969), భారత కార్మిక వర్గ విప్లవ చరిపూతలో ముఖ్య పాత్రధారి. ఎఐటియుసికి జాయింట్ సెక్రటరీ. నిజాముకు వ్యతిరేకంగా తెలంగాణా సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించాడు. ఢిల్లీలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ సమాఖ్య (ఎ.ఐ.టి.యు.సి.) జాయింట్ సెక్రటరీగా కొంత కాలం ఢిల్లీలో ఉన్నాడు. 1952-55 మధ్య చైనా, సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాలు, ఆఫ్రికన్ దేశాలు తిరిగి వచ్చాడు. ప్రపంచ ట్రేడ్ యూనియన్ సమాఖ్య ప్రధాన కార్యాలయం వియాన్నాలో (1953-54) పనిచేశాడు. 1969, ఆగష్టు 25 తేదీన గుండె పోటుతో ఢిల్లీలో చనిపో యాడు. ఆయన పేరిట హైద్రాబాద్, హిమాయత్ నగర్‌లో సి.పి.ఐ. రాష్ట్ర కార్యాలయం మఖ్దూమ్ భవన్ నిర్మించారు.



రామ కిష్టయ్య సంగన భట్ల..
9440595494

## శిశు మరణాలు దేశ భవితకు శాపాలు..!

ప్రతి వెయ్యి మంది జన్మించిన 5 ఏండ్ల లోపు శిశువుల్లో మరణించిన వారి సంఖ్యను శిశు మరణాల రేటు(ఇన్ఫాంట్ మోర్టాలిటీ రేట్, ఐయంఆర్)గా వర్ణిస్తారు. దేశ శిశు మరణాల రేటు ఆధారంగా ఆ దేశ ప్రజల ఆరోగ్య సంక్షేమం ఉంటుందని మనకు తెలుసు. ఇటీవల విడుదల చేసిన రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం ప్రస్తుత శిశు మరణాల రేటు 28 (ప్రతి 1000 శిశు జననాల్లో 28 మరణాలు) ఉందని తెలుస్తున్నది. గత వివరాల ప్రకారం భారత దేశ శిశు మరణాల రేటు 44 నుంచి నేడు 28కి తగ్గించడం కొంత విజయమే అయినా ఈ సమస్యను ప్రధానమైందని తలచి మరింత కృషి చేయాల్సి ఉందని గమనించాలి. యూనిసెఫ్-2020 నివేదిక ప్రకారం శిశు మరణాల రేటు అతి తక్కువగా ఉన్న దేశాల జాబితాలో 1.54తో ఐస్‌లాండ్, 1.56తో సాన్ మరీనో, 1.65తో ఎస్టోనియా, 1.76తో స్లోవియా, 1.79తో నార్వే, 1.82తో జపాన్, 1.85తో సింగపూర్, 1.88తో ఫిన్‌లాండ్, 1.95తో మాంటెనిగ్రో, 2.15తో స్వీడెన్‌లు ఆదర్శంగా నిలుస్తున్నాయి. 2022లో ప్రపంచ దేశాల సగటు శిశు మరణాల రేటు 27 ఉంది. అత్యధిక శిశు మరణాల రేటు నమోదైన దేశాల జాబితాలో సియెరా లియోన్‌లో 80, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లో 76, సొమాలియాలో 73, నైజీరియాలో 72, కాంగోలో 64, సౌథ్ సూడాన్‌లో 63, మాలిలో 59 అగ్రభాగాన నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా 5 ఏండ్ల లోపు వయస్సు ఉన్న శిశువుల్లో ఏడాదికి 4 మిలియన్లు (75 శాతం) మరణాలు నమోదు అవుతున్నాయి. 2020లో తొలి మాసంలోనే 2.4 మిలియన్లు, 1 మిలియన్ తొలి గంటలో (5 ఏండ్ల లోపు మరణాల్లో 47 శాతం) శిశు మరణాలు నమోదు కావడం విచారకరం. ఆఫ్రికన్ ప్రాంతంలో ఏడాది లోపు శిశువుల మరణాల రేటు 52 ఉండగా, యూరోప్ ప్రాంతంలో 7 ఉన్నది. గ్రామీణ భారతంలో ఐయంఆర్ 48 నుంచి 31 వరకు, పట్టణాల్లో 29 నుంచి 19 వరకు తగ్గడం గమనించారు. అంతర్ రాష్ట్రాలు, పట్టణాలు, గ్రామాల మధ్య శిశు మరణాల రేటులో వ్యత్యాసాలు కొన్ని ప్రమాదకర వాస్తవాలను వెల్లడిస్తున్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా శిశు మరణాల రేటు తగ్గినా ప్రతి 36 మంది శిశువుల్లో ఒకరు ఏడాది లోపు మరణించడం గమనించారు. భారతదేశంలో క్రమంగా శిశు మరణాల రేటు తగ్గినప్పటికీ మన ఇరుగుపొరుగు దేశాలతో పోల్చితే మనం వెనుకబడి ఉన్నామని తెలుస్తున్నది. బంగ్లాదేశ్, నేపాల్‌లలో ఐయంఆర్ 24, భూటాన్‌లో 23, శ్రీలంకలో 6 ఉండగా పాకిస్థాన్‌లో

మాత్రం 56 వరకు ఉండడం గమనించాలి. పెద్ద దేశాలైన బ్రెజిల్, చైనాల కన్న భారత శిశు మరణాల రేటు ఎక్కువగా ఉందని తెలుస్తున్నది. భారత రాష్ట్రాల్లో అత్యల్ప ఐయంఆర్ మిజోరాంలో 3, కేరళలో 6 నమోదైంది. చిన్న రాష్ట్రాల్లో శిశు మరణాలు తక్కువగా నమోదు కావడం గమనించారు. యంపిలో 43, యూపిలో 38, ఛత్తీస్‌ఘడ్‌లో 38, బీహార్‌లో 27, ఝార?ండ్‌లో 25 శిశు మరణాల రేటు అధికంగా ఉండడం విచారకరం.

ప్రజా మంటలు
రచయితలకు మనవి
సామాజిక, రాజకీయ అంశాలపై విశ్లేషణాత్మక రచనలు ఆహ్వానిస్తున్నాం. జయంతి, వర్ధంతి ల రచనలకు పంపకండి. సామాజిక దృక్పథంతో, శాస్త్రీయ, తార్కిక దృష్టితో రాసిన రచనలకు ప్రాధాన్యత. మీ రచనలను వర్డ్ యూనీకోడ్, పేజ్ మేకర్ అను 7.0 ఫైల్‌లలో 350 నుండి 400 లపదాలకు మించకుండా ఈమైల్ : prajamantalu@gmail.com కు పంపండి.
ఎడిటర్.

## పద్మారావునగర్ లో

# చంద్రయాన్-3 సెలబ్రేషన్స్




**సనత్ నగర్, ఆగస్ట్ 24 ( ప్రజామంటలు )**

ఇస్రో శాస్త్రవేత్తలు ప్రతిష్టాత్మకంగా ప్రయోగించిన చంద్రయాన్%--%3 విజయవంతంగా చంద్రుడిపై ల్యాండ్ కావడంతో సంబరాలు మిన్నంటాయి. ఎక్కడా చూసిన చంద్రయాన్ ప్రయోగం గురించే మాట్లాడుకోవడం కనిపిస్తోంది. పద్మారావునగర్ లోని యూరో నార్చర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో గురువారం చంద్రయాన్ %--%3 సెలబ్రేషన్స్ సందడిగా నిర్వహించారు. స్కూల్ లో చిన్నారులు జాతీయ జెండాలు పట్టుకొని, జై భారత్...జై ఇస్రో.. అంటూ నినదించారు. ఈసందర్భంగా కేకు కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. స్కూల్ లో చంద్రయాన్%--%3 కి సంబందించిన చిత్రాలతో అలంకరించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ థామస్ ఉదయ్ కుమార్, ప్రిన్సిపాల్ ఎస్తార్ విద్యావతి, స్కూల్ స్టాఫ్ కవిత, ఇమ్రానా, టీనా, కళ్యాణి, లక్ష్మీ, సరిత, అనూష, అంకిత, లక్ష్మీ, మంగమ్మ, రాజ్ కుమార్ లు పాల్గొన్నారు.

# నేనే మళ్ళీ పోటీ చేస్తాను

## - టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఇందిర



**స్టేషన్ ఘనపూర్ ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**
నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి, స్టేషన్ ఘనాపూర్ ఇన్చార్జి శ్రీమతి సింగపురం ఇందిర హాజరయ్యారు. కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడుతూ.... నేను ఈసారి కూడా స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తానని, మీరు ఇలాంటి అపోహలు నమ్మవద్దని అన్నారు. రానున్న రోజులలో కాంగ్రెస్ జెండా ఘన్పూర్ గడ్డపై ఎగరడం ఖాయంమనీ, ఇందులో ఎలాంటి సందేహం లేదని, ప్రతి ఒక్కరం ప్రజలలో కేసీఆర్ అవినీతి సొమ్ముతో మళ్లీ ఎన్నికలలో సంతలో పశువుల కొన్నిందుకే ఒకేసారి అభ్యర్థులను ప్రకటించి నియోజకవర్గం లో డబ్బులను వెదజల్లి మళ్లీ మోసపూరిత వాగ్దానాలతో అధికారం రావాలని ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఈసారి ఎట్టి పరిస్థితులలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందనే నమ్మకంతోనే కేసిఆర్ అభ్యర్థులతో కోట్ల రూపాయల ఖర్చుతో ర్యాలీలు నిర్వహిస్తున్నారని, ఇది కేవలం మరోసారి ప్రజలను మోసం చేసేందుకే చేస్తున్నారని, స్థానిక టిఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి తెలంగాణ ఏర్పడినాక ఏలాంటి అభివృద్ధి కార్యక్రమాలను పట్టించుకోలేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన మెజారిటీతో ఘనపూర్ నియోజకవర్గంలో గెలవడం ఖాయం మనీ ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మండల అధ్యక్షులు బ్లాక్ అధ్యక్షులు మండలాలకు సంబంధించిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## జనగామ అసెంబ్లీ కాంగ్రెస్ టిక్కెట్లు కోసం పొన్నాల లక్ష్మయ్య దరఖాస్తు



**జనగామ ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**
హైద్రాబాద్ గాంధీ భవన్ లో జనగామ అసెంబ్లీ టిక్కెట్ కోసం టీపీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య గురువారం ధరఖాస్తు చేసుకున్నారు. టీపీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య తరుపున గాంధీ భవన్ లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ కు దరఖాస్తు అందించారు. జనగామ నియోజకవర్గ అన్ని పట్టణ, మండలాల అధ్యక్షులు, జెడ్పీటీసీ జిల్లా నాయకులు, ఎంపీటీసీలు కౌన్సిలర్లు, మహిళా కాంగ్రెస్ బీసీ సెల్ మైనారిటీ సెల్ యూత్ కాంగ్రెస్ కిసాన్ సెల్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో డిఆర్డిఏ గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ డిఆర్డిఏ నరేష్ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత ను కలిసి పుష్పగుచ్చం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వెంట జెడ్పీ సీఈవో రామానుజనాచార్యులు ఉన్నారు.



బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ డా. బోగ శ్రావణి జన్మదిన వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలియజేసిన కర్ణాటక ఎమ్మెల్సీ బి.జి. పాటిల్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ రావు, జగిత్యాల నియోజకవర్గ ప్రజలు, నాయకులు మరియు కార్యకర్తలు




తెలంగాణ రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీస్ కార్పొరేషన్ చైర్మన్ గా డి. రాజేశ్వర్ రావు ప్రమాణ స్వీకారానికి హాజరై హార్ధిక శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛాన్ని అందజేసిన జనగామ ప్రెస్టన్ ఇన్స్టిట్యూట్ కరస్పాండెంట్ డా. బక్క ప్రవీణ్ కుమార్.



తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పట్నం మహేందర్ రెడ్డి కి అభినందనలు తెలిపారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మంత్రి రాజ్ భవన్ లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పట్నం మహేందర్ రెడ్డికి పుష్పగుచ్చం ఇచ్చి సత్కరించారు.

## అన్నారం గ్రామపంచాయతీ ప్రారంభోత్సవంపాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్ బాబు



**మహాదేవపూర్ ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని అన్నారం గ్రామ పంచాయితీ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్ బాబు అనంతరం మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కెసిఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ వలన ప్రతి సంవత్సరం మేడిగడ్డ బ్యారేజ్ అన్నారం బ్యారేజ్ సుందిళ్ల బ్యారేజ్ బ్యాక్ వాటర్ వలన అధిక మొత్తంలో నష్టం జరుగుతున్న రైతులను ఆదుకోవడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వలన కేవలం ఈ ప్రాంత రైతాంగ సోదరులు మాత్రమే నష్టపోతున్నారని మంథని నియోజకవర్గ ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజీ కావాలని గత మూడు సంవత్సరాల నుండి నష్టపోతున్న రైతాంగ సోదరులకు వెంటనే ముంపుకు గురవుతున్న పంటలపై సర్వే నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం వాళ్లకి నష్టపరిహారాన్ని చెల్లించి వాళ్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు ఈ ప్రాంత రైతులు ప్రాజెక్టుకు భూములను త్యాగం చేసి ఉపాధి కోల్పోయినప్పటికీ ఈప్రాంత రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి లాభం చేయకుండా ఈ ప్రాంత ఇసుకను అమ్ముకొని ప్రభుత్వం ఖజానా నింపుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ రమాదేవి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్ ఎంపీపీ బి. రాణి బాయ్, జడ్పిటిసి గుడాల అరుణ, ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య, గ్రామ ప్రజలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేశాలి



**మల్లాపూర్ ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**
తపస్ 317 జీవో బాధిత ఉపద్యాయులకు న్యాయం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీపెరంబుదూర్ లింబగిరి స్వామి జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య పిలుపునిచ్చారు. గురువారం ఆ సంఘ సభ్యత్వాన్ని మల్లాపూర్ మండలంలోని పలు పాఠశాలల్లో జరిపిన సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 317 జి.ఓ బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని వారిని స్థానికత ఆధారంగా వారి స్వస్థలాలకు పంపించాలని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటర్ పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాల్సిందేనని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పాఠశాలల్లో దీర్ఘకాలికంగా ఉన్న ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని పిఆర్సి కమిటీని వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని ఉపాధ్యాయుల బదిలీల ప్రమోషన్ల షెడ్యూలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ మండల అధ్యక్షుడు చిటికేశ్ మహేష్ జిల్లా నాయకులు శంకర్ గణేష్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## దోనూర్ ప్రాథమిక పాఠశాలకు స్మార్ట్ టీవీ బహుకరణ



**ధర్మపురి ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దోనూర్ కు గ్రామానికి చెందిన నవయువ యూత్ సభ్యులు 20వేల రూపాయల విలువగల స్మార్ట్ టీవీ ని బహుకరించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ పాఠశాలలో బోధన అభ్యసన కార్యక్రమానికి ఈ స్మార్ట్ టీవీ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు మరియు ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి తాము మరింత సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవయువ యూత్ సభ్యులు మరియు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాశెట్టీ రమేష్, ఉపాధ్యాయులు ఎస్. కన్నం నాయుడు, దావన్ పల్లి రమేష్, కాశెట్టి శారద, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రయాన్ - 3 సక్సెస్ విజయోత్సవాలు

### - యూరో కిడ్స్ స్కూల్ లో విద్యార్థుల సంబరాలు



**సికింద్రాబాద్ ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**
చంద్రయాన్-%--%3 సక్సెస్ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సర్వత్రా సంబరాలు జరుపుకుంటున్నారు. గురువారం పద్మారావునగర్ లోని యూరోకిడ్స్ స్కూల్ లో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు సందడి చేశారు. జాతీయ జెండాలను పట్టుకొని జయహో ఇండియా...అంటూ నినాదాలు చేశారు. కేకు కట్ చేసి, మిఠాయిలు పంచి పెట్టారు. స్కూల్ లో చంద్రయాన్-%--%3 ఫొటోలతో డెకరేషన్ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గోపా కుమార్, ప్రిన్సిపాల్ ఎస్తార్ విద్యావతి, కరస్పాండెంట్ థామస్ ఉదయ్ కుమార్, టీచర్లు నవ్యత, ఫర్జానా, వసుధ, నీరజ, సోని, శ్రీవాణి, ఖాన్సా, పద్మ, సుజి, రేణుక, అయేషా, ప్రసన్న, పుష్ప, సునీత, ప్రవీన్, వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.



సచివాలయం ప్రాంగణంలో మసీద్, చర్చి, ఆలయం ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి కొప్పుల ఈశ్వర్.మంత్రి వెంట ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్, కోరుకంటి చందర్, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కమిషన్ ఎండి కాంతి వేస్లి, మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ శంకర్ లూక్, తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ సాగర్, పలువురు క్రిస్టియన్ మైనారిటీ నేతలు

## బిసిలకు టికెట్ల ఇవ్వని పార్టీలను బిసిలు తరిమి కొడుతారు

### - బిసి రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్



**జనగామ ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**
బిసిలకు టికెట్ల ఇవ్వని పార్టీలను బిసిలు తరిమికొడుతారని బిసి రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. గురువారం జనగామ జిల్లాలో బిసి రాజ్యాధికార సమితి సమావేశంలో వివిధ కులసంఘాల నాయకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా బిసి రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ పాల్గొని మాట్లాడుతూ.... బిసిలను ఐక్యం చేసేందుకు ఈనెల 27న వరంగల్ లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి బిసి వ్యతిరేక పార్టీలను భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బహిరంగ సభ పోస్టర్ ను అంబేద్కర్ విగ్రహం ముందు విడుదల చేశారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు వేముల బాలరాజు, బిసి రాజ్యాధికార సమితి ఉమ్మడి జిల్లా ఇంచర్జ్ మంగళంపల్లి రాజు, కారంపూడి సతీష్, కూరపాటి శ్రీనివాస్, మునురుకపు సంఘం గన్ను కార్తీక్, గౌడ సంగం నాయకులు రంగు ప్రవీణ్, దూదేకుల సంఘం ఎం.డి. అబ్బాస్, కుర్మ సంఘం కడకంచి మల్లేష్, విశ్వ బ్రాహ్మణ సంఘం నవీన్ చారి, రాములు, మేర సంఘం వెంపటీ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## జనగామ మున్సిపాలిటీని సరిదిద్దండీ



**జనగామ ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**
ఇటీవల జనగామ పట్టణంలో పురపాలక సంఘము వాడవాడలో ఏర్పాటు చేసిన తడి, పొడి, ఇతర వ్యర్ధ చెత్త ను వేసే బాక్స్ లను ఏర్పాటు చేశారు. అయితే మూడు రంగులలో ఏర్పాటు చేసిన ఈ చెత్త బాక్స్ లపై మూడు కూడా తడి చెత్త అని వ్రాసి ఉండటం అందరిని ఆశ్చర్యంలో ముంచి అయోమయం సృష్టిస్తుంది. ఈవిషయమై సాదిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్ట్ న్యాయ వాది సాదిక్ అలీ జిల్లా కలెక్టర్ కు గురువారం పిర్యాదు చేశారు. బస్టాండ్ లో ఏర్పాటు చేసిన ఈ చెత్త బాక్స్ లపై ఎలాంటి సంకేతాలు లేకుండా మరింత ఘోరంగా వదిలి వేశారని, జనగామ మున్సిపాలిటీ చేసిన ఈ తప్పిదాలను సరిచేయాలని కలెక్టర్ ను కోరారు

## బెస్ట్ అవైలబుల్ పథకం కింద పేద స్టూడెంట్స్ కు ఉచిత విద్య ఎస్సీఆర్పీఎస్ స్టేట్ ప్రెసిడెంట్ సుదర్శన్ బాబు



**సనత్ నగర్ ఆగస్ట్ 24 (ప్రజామంటలు)**
తెలంగాణ ప్రభుత్వ ఎస్సీ అభివృద్ధి శాఖ అమలు చేస్తున్న "బెస్ట్ అవైలబుల్ పథకం" ద్వారా నిరుపేద దళిత విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్య లభిస్తుందని షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుదర్శన్ బాబు తెలిపారు. ఈ పథకం ద్వారా లాటరీ పద్ధతిలో సీట్లు పొందిన 22 మంది దళిత పేద విద్యార్థులను గురువారం న్యూ బోయిగూడా లోని సెయింట్ ఫిలోమినా గర్ల్స్ హైస్కూల్లో ఫ్రీగా అడ్మిషన్లు పొందారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో 159 మంది అర్హులైన నిరుపేద దళిత విద్యార్థులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారని సుదర్శన్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఆర్పీఎస్ సిటీ వైస్ ప్రెసిడెంట్ కురుమ మహేందర్, ఉదయ్ కుమార్, ఎల్లం కుమార్, ప్రవీణ్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కరీంనగర్ కాంగ్రెస్ నాయకులు కంపల్లి ఎల్లయ్య ను కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా నియమించిన డిసిసి అధ్యక్షులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ

# పొగాకు క్యూరింగ్‌కు మల్టీ పర్పస్ డ్రయర్ల నిర్మాణం..

## మెట్ట ప్రాంతంలో 17 యూనిట్ల ఏర్పాటు..

అమరావతి: కూలీల కొరత తీవ్రం కావడంతో రైతులు వ్యవసాయంలో యాంత్రీకరణ వైపు మొగ్గు చూపుతున్నారు. యాంత్రీకరణను ప్రభుత్వం ప్రోత్సహించి రాయితీలు కల్పించడంతో ఎక్కువ మంది రైతులు సాగులో మెషీన్ల సాయంతో లబ్ధిపొందుతున్నారు. పొగాకు సాగుకు కూలీల సమస్య ఏర్పడడంతో పశ్చిమ గోదావరి జిల్లా మెట్ట ప్రాంతం రైతులు యంత్రాల సాయం తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా పొగాకు క్యూరింగ్ విధానంలో మార్పులు తీసుకొస్తున్నారు. సాధారణంగా తోటలోని పొగాకు రెలిసి బ్యారన్ వద్దకు తీసుకువచ్చి కర్రలకు అల్లి బ్యారన్‌లో ఉంచి క్యూరింగ్ చేస్తారు. ఈ విధానం వల్ల ఉత్పత్తి వ్యయం పెరగడంతో పాటు కూలీల సంఖ్య ఎక్కువ అవసరం. ఈ విధానానికి స్వస్తి పలకడానికి విదేశాల్లో అవలంభిస్తున్న నూతన టెక్నాలజీని తీసుకువచ్చారు. జర్మనీలో రైతులు ఏర్పాటు చేసిన లూజ్‌లీఫ్ బ్యారన్లను పరిశీలించిన అధికారులు ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నారు. రెండు సంవత్సరాలుగా బ్రెజిల్ నుంచి పరికరాలను దిగుమతి చేసుకుని జిల్లాలోని గోపాలపురం, యర్నగూడెంలో బ్యారన్లు నిర్మించారు. సుమారు రూ.9 లక్షల వ్యయంతో బ్యారన్ నిర్మించి ప్రయోగాత్మకంగా క్యూరింగ్ చేశారు. దీనివల్ల మంచి ఫలితాలు రావడంతో ఐటీ–సీ భాగస్వామ్యంతో ఈ ఏడాది గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో 14 యూనిట్ల నిర్మాణం చేపట్టారు. వీటిని పొగాకు క్యూరింగ్‌కు మాత్రమే కాకుండా మల్టీపర్పస్ యూనిట్లు–గా వినియోగిస్తున్నారు.





చిట్యాలలో 4 యూనిట్ల నిర్మాణం..: మల్టీపర్పస్ యూనిట్ ఖరీదు రూ.9 లక్షలుగా ఉంది. ఐటీ–సీ రూ.3 లక్షలు, పొగాకు బోర్డు రూ.3 లక్షలు ఇస్తుండగా, రైతు వాటాగా రూ.3 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. గోపాలపురం మండలంలోని చిట్యాలలో ఈ ఏడాది 4 యూనిట్లు నిర్మిస్తున్నారు. పొగాకు క్యూరింగ్‌తో పాటు కొబ్బరి, మొక్కజొన్న, అల్లం, పసుపు వంటి పంటలు డ్రై చేస్తున్నారు. 2,500 కొబ్బరి కాయలు ఒకేసారి డ్రై చేస్తున్నారు. దీనికి 30 గంటల సమయం పడుతుంది. 25 క్వింటాళ్ల మొక్కజొన్న గింజలను 12 గంటల్లో డ్రై చేస్తున్నారు. శీతాకాలం, వర్షాకాలంలో యూనిట్ బాగా ఉపయోగపడుతుంది. డ్రై చేసిన పంటను గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకోవచ్చని రైతులు అంటున్నారు. మల్టీపర్పస్ యూనిట్ల వల్ల రైతుకు 50 శాతం ఖర్చు తగ్గుతుంది. కూలీల అవసరం ఉండదు. పొగాకు రైతులకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది. సాధారణ పద్ధతిలో రెండు బ్యారన్లు క్యూరింగ్ చేసే పొగాకును లూజ్‌లీఫ్ బ్యారన్‌లో ఒకేసారి చేయవచ్చు. సాధారణ పద్ధతికి, లూజ్‌లీఫ్ బ్యారన్‌లో క్యూరింగ్ చేసే విధానానికి బ్యారన్‌కు సుమారు రూ.1.50 లక్షల తేడా వస్తుందని రైతులు తెలిపారు. బ్యారన్‌కు రెండు క్వింటాళ్లు పొగాకు ఆదా అవుతుంది. లూజ్‌లీఫ్ బ్యారన్‌కు ఆటో ప్యానల్ బోర్డు ఏర్పాటు– చేశారు.

క్యూరింగ్‌లో టెంపరేచర్ హెచ్చు తగ్గులను బోర్డులోని సెన్సార్ పరికరం సరి చేసుకుంటుంది. ఒకేసారి 1200 నుంచి 1300 కిలోల పొగాకు క్యూరింగ్ అవుతుంది. రైతులకు అన్ని విధాలుగా ఉపయోగం..: పొగాకు క్యూరింగ్ కోసం ఏర్పాటు చేసిన లూజ్ లీఫ్ బ్యారన్లు మల్టీపర్పస్ యూనిట్లుగా ఉపయోగపడుతున్నాయి. పొగాకు క్యూరింగ్‌తో పాటు డ్రయర్‌గా ఉపయోగిస్తున్నాం. కొబ్బరి, మొక్కజొన్న, పసుపు, అల్లం వంటి పంటల్ని డ్రై చేసి నిల్వ ఉంచుతున్నాం. కూలీల సమస్యను అధిగమించమించడంతోపాటు పంట నాణ్యత బాగుంటుంది. బ్యారన్‌కు ఏడాదికి రెండు క్వింటాళు పొగాకు ఆదా అవుతుంది.


# ఉక్రెయిన్-రష్యా యుద్ధం.. వెనక్కి వచ్చేసిన ఎయిర్ ఇండియా విమానం

న్యూఢిల్లీ: ఉక్రెయిన్‌పై రష్యా మిలిటరీ ఆపరేషన్ ప్రారంభించింది. దీంతో దేశంలోని విమానాశ్రయాలు, గగనతలాన్ని ఉక్రెయిన్ మూసింది. ఈ నేపథ్యంలో.. ఆ దేశంలో ఉన్న భారత విద్యార్థులను వెనక్కి తీసుకొచ్చేందుకు కీవ్‌కు బయల్దేరిన ఎయిర్ ఇండియా విమానం వెనక్కి వచ్చేసింది. గురువారం ఉదయం 7.30 గంటలకు న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ విమానాశ్రయం నుంచి 'ఏఐ 1947' ఎయిర్ ఇండియా విమానం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు బయల్దేరింది.

అయితే రష్యా యుద్ధం నేపథ్యంలో గగనతలాన్ని మూసేస్తున్నట్లు ఉక్రెయిన్ ప్రకటించింది. దీంతో ఎయిర్ మిషన్ సూచన మేరకు అధికారులు విమానాన్ని మళ్లీ భారత్‌కు మళ్లించారు. కాగా, కీవ్ నుంచి బయల్దేరిన ఓ విమానం గురువారం ఉదయం 7.45 గంటలకు ఢీల్లీకి చేరింది. అందులో 182 మంది భారతీయులు స్వదేశానికి చేరుకున్నారు. వారిలో ఎక్కువ మంది విద్యార్థులే ఉన్నారు. గతంలో ఉక్రెయిన్‌లో జరిగిన అంతర్గత పోరులో మలేషియాకు చెందిన విమానం కూలిపోయిం ది. 2014లో రష్యా అనుకూల వేర్పాటువాదులు, ఉక్రెయిన్ సైన్యానికి మధ్య భీకర పోరు జరిగింది. ఈ క్రమంలో వేర్పాటువా దులు మలేషియా విమానాన్ని కూల్చివేశారు. దీంతో విమానంలోని 298 మంది మృతిచెందారు.




# రష్యా ఉక్రెయిన్ ఉద్రిక్తతల ప్రభావం మనపై ఎంత?



న్యూఢిల్లీ: ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందని అంటారు. రష్యా ఉక్రెయిన్ ఉద్రిక్తతల ప్రభావం మనపైన అలాగే పడుతుందన్న ఆందోళనలున్నాయి. ప్రపంచమే కుగ్రామంగా మారిన ఈ డిజిటల్ యుగంలో ఎక్కడ చీమ చిటుక్కుమన్నా అన్ని దేశాలకూ కష్టనష్టాలు తప్పవు. ఉక్రెయిన్‌లో ఉన్న భారతీయ విద్యార్థుల భద్రత పాటు రాబోయే రోజుల్లో సహజవాయువు దగ్గర్నుంచి గోధుమల వరకు అన్ని రకాల ధరలు పెరిగిపోయి సామాన్యుడి నడ్డి విరుస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఉక్రెయిన్‌లో దాదాపుగా 20 వేల మంది భారతీయులు ఉన్నారు. వీరిలో ఎక్కువగా మెడికల్ విద్యార్థులే. ఫార్మా, ఐటీ రంగ నిపుణులూ ఉన్నారు. ఇప్పుడు వారి భద్రతపై ఆందోళన నెలకొంది. వారిని వెనక్కి తీసుకురావడానికి భారత్ ప్రత్యేకంగా విమానాలు నడుపుతోంది. రష్యాపై ఆయుధాల కోసం మనం ఎక్కువగా ఆధారపడి ఉన్నాం. ఎస్?400 క్షిపణి వ్యవస్థ కొనుగోలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాం. అమెరికా రష్యాపై ఆంక్షల నేపథ్యంలో ఈ ఒప్పందం రద్దు కోసం అగ్రరాజ్యం నుంచి మనపై కూడా ఒత్తిడి పెరుగుతుంది. ఈ ఉద్రిక్తతల్లో చైనా పాత్ర కూడా మనపై ప్రభావాన్ని చూపిస్తోంది. 2020 జూన్‌లో గల్వాన్ ఘర్షణల తర్వాత చైనాతో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. డ్రాగన్ దేశంతో రష్యాకి మంచి స్నేహబంధం ఉండడంతో పాటు అక్కడ ప్రభుత్వంలో పరపతి కూడా ఉంది. దీంతో కేంద్ర ప్రభుత్వానికి పుతిన్ ప్రభుత్వంపై గట్టి విమర్శలు చేయలేక, ఉక్రెయిన్‌కి మద్దతునిచ్చే పరిస్థితి లేక ఎటూ మొగ్గు చూపించకుండా ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. 2014 నుంచి చమురు ధరలు కనీవినీ రీతిలో పెరిగిపోతున్నాయి. ముడి చమురు బారెల్ ధర 100 డాలర్లకి సమీపంలో ఉంది. యూరప్ దేశాలకు రష్యా నుంచే చమురు సరఫరా జరుగుతుంది. రష్యాపై ప్రపంచ దేశాల ఆంక్షలతో బారెల్ ధర 150 డాలర్లకు చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫలితంగా భారత్‌లో పెట్రోల్ ధరలు లీటర్‌కి రూ.7?8 రూపాయలు పెరిగే అవకాశం ఉంది. భారత్‌కి అవసరమైన చమురులో 85శాతం దిగుమతులపైనే ఆధారపడి ఉంది. దీంతో చమురు దిగుమతుల వ్యయం తడిసిమోపెడు అవుతుంది. కరోనా సంక్షోభం ఆహార ధాన్యాల ఎగుమతి దిగుమతులపై తీవ్రంగానే ప్రభావం చూపిస్తోంది. గోధుమల ఎగుమతిలో రష్యా ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంటే, ఉక్రెయిన్ నాలుగో స్థానంలో ఉంది.

ఈ రెండు సమరానికి సై అనడంతో వాటి ధరలు కూడా ఆకాశాన్నంటే అవకాశాలున్నాయి. బీరు తయారీకి వాడే బార్లీ గింజలు అధికంగా ఉక్రెయిన్‌లో పండుతాయి. కరోనా నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుం టున్న బీరు కంపెనీలకూ ధరాభారం తప్పదు. వంట నూనె ధరలు కూడా మరింతగా పెరిగే చాన్స్ ఉంది. ప్రపంచ దేశాల్లో సన్‌ఫ్లవర్ ఆయిల్ ఉత్పత్తిలో ఉక్రెయిన్ మొదటి స్థానంలో ఉన్నందున వాటి ధరలకి రెక్కలు రావచ్చు. రష్యాపై ఆంక్షల కారణంగా పలాడియమ్ లోహం ఎగుమతులు నిలిచిపోతాయి. ఆటోమేటివ్ ఎగ్జాస్ట్ సిస్టమ్స్, మొబైల్ ఫోన్లలో దీనిని వాడతారు. దీంతో వీటి ధరలు కూడా పెరిగే అవకాశాలున్నాయి.

# ఫ్రిజ్‌లో పెట్టిన ఆహారం.. అదే శాపమయింది..!



సాధారణంగా ఫుడ్ పాయిజనింగ్ అంటే సాధారణంగా వాంతులవడం, ఆహారం జీర్ణం కాకపోవడం వంటివి జరుగుతాయి. ఫుడ్ పాయిజినింగ్ కారణంగా ఒక్కొసారి కొన్ని కేసుల్లో ప్రాణంతకం కూడా కావచ్చు కానీ చాలావరకు సురక్షితంగా బయటపడతారు. కానీ ఇక్కడొక వ్యక్తికి ఫుడ్ పాయిజినింగ్ అతని జీవితాన్ని అత్యంత విషాదమయంలోకి నెట్టేసింది. అసలేం జరిగిందంటే...అమెరికాకు చెందిన 19 ఏళ్ల వ్యక్తి ఫ్రిజ్‌లో పెట్టిన ఆహారాన్ని వేడిచేసుకుని తినడం అతనికి అలవాటు. ఎప్పటిలాగానే రెస్టారెంట్ నుంచి తెచ్చుకున్న ఆహారాన్ని ఫ్రిజ్‌లోంచి తీసి వేడిచేసుకుని తిన్నాడు. అయితే అతను తిన్నవెంటనే వాంతులు చేసుకుని తీవ్ర అశ్వస్థకు గురైయ్యాడు. దీంతో అతని స్నేహితుడు ఆసుపత్రితో జాయిన్ చేశాడు. ఆసుపత్రికి వెళ్లిన కొద్ది సేపట్లోనే అతని బీపీ పడిపోయి పరిస్థితి క్రిటికల్ అయిపోయింది. దీంతో వైద్యులు అతనికి వైద్యా పరీక్షలు నిర్వహించారు. కానీ అతనికి ఏమైందో అసలు అర్థం కాలేదు. కాసేపటకికి అతని శరీరం దద్దుర్లుగా మారి ఎర్రగా గాయాలు ఏర్పడటం తీవ్ర నోప్పి రావడం జరిగింది. దీంతో అతన్ని హెలికాప్టర్ సాయంతో మెరుగైన చికిత్స నిమిత్తం యూఎస్‌లోని మసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్‌కి తరలించారు. అక్కడ వైద్యులు మెనింగోకాకల్ అనే అంటు వ్యాధి వచ్చినట్లు తెలిపారు. అయితే మెనింగోకాకల్ అన్ని వయసుల వారిని ప్రభావితం చేస్తుంది కానీ టీకాతో నివారించవచ్చు. మెనింగోకోకల్ వ్యాధిని యాంటీబయాటిక్స్‌తో చికిత్స చేస్తారని డాక్టర్లు తెలిపారు. కానీ రోగికి అతని మిడిల్ స్కూల్ వయసులో మెనింగోకాకల్ వ్యాక్సిన్ తీసుకున్నాడని అయితే అతను 16 ఏళ్ల ప్రాయంలో తీసుకోవల్సిన రెండు డోసుల వ్యాక్సిన్‌ని తీసుకోలే దని వెల్లడించారు. ఈ వ్యాధి కారణంగా అతని శరీరం తీవ్ర ఇన్ఫెక్షన్‌కి గురవ్వడంతో కాలి వేళ్లను చేతి వేళ్లను తీసేశారు. ప్రమాదవశాత్తు ఆ ఇన్ఫెక్షన్ మెదడుకి వ్యాపించలేదు. అయితే ఆ టీనేజర్ ఇప్పుడు కోలుకున్నాడు గానీ ఆ వ్యాధి కారణంగా ఇప్పుడు చాలా రకాల దీర్ఘకాలిక సమస్యలను ఎదుర్కొంటున్నాడు. దీంతో ఏదైనా ఫిట్‌నెస్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించే ముందు లేదా మీ ఆహారంలోఏవైనా మార్పులు చేసే ముందుఎల్లప్పుడూ మీ వైద్యుడిని లేదా డైటీషియన్‌ని సంప్రదించండి.

## యుద్ధం ఎఫెక్ట్ : వంద డాలర్లకు పెరిగిన క్రూడాయిల్ ధర

రష్యా ఉక్రెయిన్ దేశంపై యుద్ధం ప్రారంభించడంతో గురువారం ప్రపంచ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర బ్యారెల్ 100 డాలర్లకు చేరింది. రష్యా ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద చమురు ఉత్పత్తిదారు. ఇది ప్రధానంగా యూరోపియన్ రిఫైనరీలకు ముడి చమురును విక్రయిస్తుంది. గడిచిన ఏడేళ్లలో తొలిసారిగా అంతర్జాతీయ మార్కెటులో ముడి చమురు బ్యారెల్ ధర 100 డాలర్ల మార్కును తాకింది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వల్ల 2014వ సంవత్సరం తర్వాత తొలిసారిగా చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లకు చేరాయి.2014వ సంవత్సరంలో ముడిచమురు బ్యారెల్ ధర 100 డాలర్లను అధిగమించింది.ఈ యుద్ధం వల్ల ఇంధనంతోపాటు గోధుమలు, లోహాల ధరలు పెరగనున్నాయి. ఇటీవల కరోనా లాక్ డౌన్ల తర్వాత సంక్షోభం నెలకొంది.ఈ యుద్ధం ప్రపంచ ఇంధన సరఫరాలకు అంతరాయం కలిగిస్తుందనే ఆందోళన రేకెత్తిస్తోంది.



## రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

### – జాతీయ అధ్యక్షుడు కొల్లూరి మల్లేశ్

పెద్దపల్లి: మకిలి దుస్తులను చేతులతో శుభ్రం చేసే రజకులే అంటరానితనానికి అస్పృశ్యతకు నిదర్శనమని, అలాంటి వృత్తిని జీవనోపాదిగా చేసుకుని బతుకుతున్న రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి రిజర్వేషన్లు అమలు చేయాలని మన రజక సంఘం జాతీయ అధ్యక్షుడు కొల్లూరి మల్లేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి రమేష్ అధ్యక్షతన గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలోని 17రాష్ట్రాల్లో రజకులకు ఎస్సీ రిజర్వేశన్లను అక్కడి ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని, ఇటీవలే మధ్యప్రదేశ్ లోని బీజేపీ పాలిత ప్రభుత్వం సైతం ఎస్సీలుగా గుర్తిస్తూ జీవో జారీ చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిస్తే, రిజర్వేషన్లపై పార్లమెంట్లో బిల్లు చేయడానికి అవకాశం ఉందని, వెంటనే తెలంగాణా ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు సిద్దం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం లేఖ రాసినా గానీ, తెలంగాన ప్రభుత్వం స్పందిచకపోవడం భాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రజకులకు ఎస్సీ రిజర్వేషన్లు కలిపించడం వల్ల దళితులకు ఎలాంటి అన్యాయం జరుగదని, కమిషన్ పేరుతో కాలాయాపన చేయకుండా కేంద్రానికి వారం రోజుల్లోగా నివేదికలు పంపాలని పేర్కొన్నారు. రజకులను ఎస్సీలుగా ప్రకటించినట్లయితే మిగతా కులాల వారితో పాటు సమానంగా విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ అంశాల్లో అభివృద్ధి చెందడానికి అవకాశాలు మెరుగవుతాయని అభిప్రాయం వెలిబుచ్చారు. అదేవిదంగా, కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రజకులకు ఆధునిక సాంకేతికత కలిగిన మిషన్లను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాలని, దొభీఘాట్లను ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ద్వారా ద్వారా కాకుండా, వ్యక్తిగత అవసరా ల కోసం ఏర్పాటైన రజక కుల సంఘాలపై ప్రభుత్వం చర్యలు తీసుకో వాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి రామ్మూర్తి, దొడ్డుపల్లి జగదీశ్, బొడ్డుపల్లి శ్రీనివాస్, బొడ్డుపల్లి అశోక్, బొడ్డుపల్లి సంపత్, బొడ్డుపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రతా బలగగాల స్థయిర్యం దెబ్బతీయొద్దు !

పుల్వామా ఘటన..సర్జికల్ స్ట్రయిక్స్‌పై రెండేళ్లు దాటినా ఇంకా విమర్శలు చేయడం రాజకీయ నాయకు లకు సరికాదు. ఒకవేళ ఈ ఘటనలతో మోడీ రాజకీయ లబ్ది పొందాలనుకుంటే... అంతక న్నా ఎక్కువగా విపక్ష పార్టీలు లబ్దికోసం యత్నిస్తున్నాయనే చెప్పాలి. ఎందుకుంటే ఈ విషయం చాలా సున్నితమైనది. అది కూడా భద్రతాదళాల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడడం సరికాదు. మన సైనికులు ఎందరో వారి జీవితాలను త్యాగంచేసి పోరాడుతున్నారు. ఒకవైపు చైనా మరోవైపు పాక్ కయ్యానికి కాలుదువ్వు తోంది. నిరంతరంగగా వీరితో మన దళాలు పోరాడుతున్నాయి. ఈ క్రమంలో రాహుల్ గాంధీ పదేపదే దీనిని ప్రస్తావించడం, తాజాగా తెలంగాణ సిఎం కెసిఆర్ కూడా దీనిని రాజకీయం చేయాలని చూడడం సరికాదు. సర్జికల్ స్ట్రయిక్స్ జరిపాక సైన్యానికి స్వేచ్ఛను ఇచ్చారు. ఆ తరవాతనే సరిహద్దుల్లో ఇప్పుడు బారత్ గట్టిగా పోరాడగలుగుతోంది. కాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేతలో మన బలగాలు నిత్యం పోరాడుతున్నాయి. వారి జీవితాలను ఆత్మాహుతి చేస్తున్నాయి. మరోవైపు సామాజిక మాధ్యమాల్లో భారత్ వ్యతిరేక ప్రకటనలు పాక్ ప్రేరేపిత సంస్థల నుంచే వస్తున్నాయి. ఇకపోతే అధికార విపక్ష పార్టీల మధ్య విమర్శలు ప్రతివిమర్శలు వేడెక్కుతున్నాయి. ఇది పాక్‌కు కలసివచ్చే అంశంగా చూడాలి. ఇటీవల భారత్ వ్యతిరేకతకు పాల్పడుతున్న అనేక యూట్యూబ్ ఛానళ్లను కూడడా నిషేధించిన విషయం ఇక్కడ గమనించాలి. పుల్వామా ఉగ్రదాడిపై విపక్ష కాంగ్రెస్, అధికార బీజేపీల మధ్య మాటల యుద్ధం మళ్లీ మొదలు కావడం అన్నది భారత వ్యతిరేక శక్తులకు ఆజ్యం పోసేదే తప్ప మరోటి కాదు. 947, 1965, 1971 నాటి యుద్ధాల్లో కూడా మన సైనికులు వీరోచితంగా పోరాడి పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పిన విషయాన్ని మరువరాదు. వీరజవాన్ల త్యాగాలు వృథాగా పోవని, ఇప్పుడు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉందని, కాంగ్రెస్ మాదిరిగా భద్రతపై రాజీపడ బోమని బిజెపి నేతలు వ్యాఖ్యానించారు. ఓ వైపు భద్రతా బలగాలు, ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తామని చెబుతూనే హస్తం పార్టీ అడపాదడపా తన అసలు రంగును బయటపెట్టుకుంటున్న తీరు సరికాదు. విమర్శలకు కూడా ఓ హద్దుండాలి. సర్జికల్ స్ట్రయిక్స్ జరిగాయా..జరిగితే రుజువేదని కెసిఆర్ ఇప్పుడు ప్రశ్నించడం కూడా దేశ బలగాల స్థయిర్యాన్ని దెబ్బతీయడం తప్పమరోటికాదు. రాజకీయాలు వేరు..దేశ భద్రత వేరని పాలకులు గగుర్తించాలి. ముంబై దాడులే కావచ్చు...పార్లమెంట్‌పై ఉగ్రదాడి కావచ్చు... పూరి నరమేధం కావచ్చు...తాజాగా పుల్వామా కావచ్చు..ఏ విషయంలోనూ పాక్‌కు గట్టి బుద్ది చెప్పేలా భారత్ ఎప్పటికప్పుడు యత్నిస్తూనే ఉంది. మనలో విభేదాలను దీనిని అలుసుగా తీసుకుని పాక్ దూకుడుగా ప్రవర్తిస్తోంది. పుల్వామా ఉగ్రవాద దాడి తరవాత భారత సైన్యం దుందుడుకు, దుస్సాహస చర్యలకు దిగడానికి వెనకాడడం లేదు. సైనిక పరంగా జవాబివ్వాల్సిన చోట ఎక్కడా మన బలగాలు వెనక్కి తగ్గగడం లేదు. భారత సైన్యానికి ప్రధాని మోదీ పూర్తి స్వేచ్ఛనిస్తున్నట్లు ప్రకటించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిందేనని సైన్యానికి పాక్ ప్రధాని ఇమ్రాన్ ఆదేశాలివ్వడం మనం గమనించాలి. పుల్వామా ఉగ్రవాద దాడిలో పాకిస్తాన్ హస్తం లేదనీ, భారత్‌లోనే ఆ దాడికి కుట్ర పన్ని అమలు చేశారని పాక్ వాదించడం ద్వారా తప్పించుకునే ప్రయత్నాలుచేసింది. అలాగే సర్జికల్ స్ట్రయిక్స్ తరవాత కూడా ఇలాంటి బుకాయింపులే పాక్ నుంచి వచ్చాయి. కానీ అభినవ్ బింద్రా పట్టుబడ్డ తీరు తరవాతి పరిణామాలు మనకు తెలిసిందే. పుల్వామా ఘటన తరవాత దేశమంతటా అసువులు కోల్పోయిన జవాన్లకు సానుభూతి వెల్లువ మాత్రమే కాదు, కశ్మీర్‌లో ఉగ్రవాదుల పట్ల, వారిని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ పట్ల తీవ్ర వ్యతిరేకత కూడా పెల్లుబికింది. ఆక్రమిత కశ్మీర్‌పై భారత సైన్యం దాడి చేస్తుందని, ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేస్తుందని, మసూద్ అజర్ లాంటి ఉగ్రవాదులను హతమారుస్తుందని రకరకాల అంచనాలు ప్రచారం అయ్యాయి. మోదీ ఈ అవకాశాన్ని వదులుకోరు.. పాక్‌కు ఏదో రీతిలో బుద్ధి చెబుతారని ప్రజలంతా భావించారు. అయితే అంతర్జాతీయంగా ఉన్న ఒత్తిళ్లను కూడా మనం పరిగణనలోకి తీసుకోవాలి. సీమాంతర ఉగ్రవాదాన్ని అనేక సందర్భాల్లో విమర్శించి కాంగ్రెస్ నేతలు ఇప్పుడు అసమర్థ వ్యాఖ్యలుచేయడం సరికాదు. 2014లో మోదీ అధికారంలోకి రావడానికి పాకిస్థాన్, సీమాంతర ఉగ్రవాదం పై ఆయన చేసిన ప్రకటనలు కూడా ఎంతో కొంత కారణమయ్యాయన్న విషయం కాదనలేము. అయితే నిఘా విభాగాలను మోదీ సొంత రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. పుల్వామా, కార్గిల్ రెండూ పాకిస్థాన్ ప్రేరేపిత ఘటనలే అన్నది ముమ్మాటికి నిజం. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ నరేంద్రమోదీ కశ్మీర్ సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలు అక్కడ ప్రజాస్వామ్య వాతావరణం ఏర్పడేందుకు, మానవీయ విలువలు ఏర్పడేందుకు, కశ్మీరీలను మనలో కలుపుకునేందుకు దోహదం చేసాయి. 370 ఆర్టికల్ రద్దు తరవాత పెద్ద విజయాన్ని సాధించాం. అక్కడ తన్ని తరిమివేయబడ్డ కాశ్మీర్ పండిట్లకు ఆదరణ దక్కింది. వారిలో ధైర్యం వచ్చింది. ఉగ్రవాద చర్యలను అరికట్టే కార్యక్రమాలు ముమ్మరంఅయ్యాయి. కాశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితులు చూస్తూంటే దీర్ఘకాలం హింసాయుత ఘర్షణలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీటిని తట్టుకుని ముందుకు సాగాలి. అలాగే అక్కడ ప్రజలను గత పాలకులుఏ పరోక్షంగా ప్రేపిస్తున్నారు. చాలామందదికి పాక్‌తో సంబంధాలు ఇప్పటికీ ఉన్నాయి. వీటిని కాదనలేం. ఈ క్రమంలో దేశభద్రతా చర్యల విషయంలో మనమంతా సంయమనంతో విమర్శలు చేయాలి. మన ప్రకటనలు పాక్‌కు,చైనాకు ఉప్పందించేలా ఉండరాదు.

# చిత్తవుతున్న పత్తిరైతులు

## తేమ పేరుతో అధికారుల తిరస్కరణ
## దిక్కులేక దళారులను ఆశ్రయిస్తున్న రైతన్న



ఆదిలాబాద్, : ఎన్నిచర్యలు తీసుకున్నా,అధికారులు పర్యవేక్షిస్తున్నా పత్తి రైతుకు దళారుల బెడద తప్పడం లేదు. సీసీఐ కొనుగోలు కేంద్రం అధికారులు నిబంధనల పేరిట ఇబ్బందులు పెడుతుండటంతో గత్యంతరం లేని రైతులు మధ్య దళారులకే విక్రయిస్తున్నారు. పత్తి బాగాపండించే ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం లాంటి జిల్లాల్లో రైతులు ఏటా సమస్యలు ఎదుర్కొంటున్నా వారిని పట్టించుకోవడం లేదు. సిసిఐ నిబంధలను పత్తి రైతులను పంట అమ్ముకునేలా చేస్తోంది. దీంతో పత్తి రైతు దిగులు చెందుతున్నాడు. అకాల వర్షాలతో పంట దెబ్బతిని దిగుబడి తగ్గిందని ఓ వైపు ఆందోళన చెందుతుంటే మరోవైపు పంట కొనుగోళ్లు లేక కలవరపడుతున్నాడు. నిబంధనల పేరిట ప్రభుత్వరంగ సంస్థలు ఇబ్బంది పెడుతుంటే.. దళారులు ధర తగ్గించి పంట కొనుగోలు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో జిల్లాల్లో దళారులది ఆడిందే ఆటగా మారింది. ప్రధానంగా కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో పత్తిని ఎక్కువగా పండిస్తారు. ఈ ఏడాది జిల్లాల్లో వేల హెక్టార్లలో రైతులు పత్తి పంట సాగు చేశారు. వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని భావించారు. మొదట్లో పంట బాగానే ఉన్నా అకాల వర్షాల వల్ల పంట కొంత దెబ్బతింది. ఎడతెరపి లేకుండా 15 రోజుల పాటు వర్షం కురియడంతో పంట చేలల్లోనే నీరు నిలువగా, కొన్ని చోట్ల పత్తి నల్లబారింది. దీంతో లక్ష క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. పత్తి కొనుగోలులో అవకతవకలు జరగకుండా ఉండాలనే ఆలోచనతో పత్తి సాగు చేసిన రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను కూడా జారీ చేశారు. మధ్య దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి సీసీఐలో ఎక్కువ ధరకు అమ్ముకోకుండా ఉండాలనే ఆలోచనతో కొనుగోలు కేంద్రం వద్ద సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు అమ్మకానికి వచ్చిన రైతు ఆధార్ కార్డును సరిచూసి, ఐరిష్ కెమెరా ద్వారా వివరాలు సరిచూసి, వేలి ముద్ర తీసుకుని కొనుగోలు చేయాలని ఆదేశాలు వచ్చాయి. తక్‌పట్టీపై కూడా రైతు ఫొటో ఉండేలా చూసుకోవాలని సూచించారు. అయినా తేమశాతం పేరుతో తిప్పిపంపడంతో రైతులు పత్తి అమ్మకాలు జరుగక ఇబ్బందులు పడుతున్నారు. అయితే అధికారులు నిబంధనలు పెట్టడంతో ఇప్పుడు పల్లెల్లోకి దళారులు వచ్చి నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఇందులో కూడా కొందరు తూకంలో మోసానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పల్లెల్లో ఇలా ఏ గ్రామానికి వెళ్లినా మధ్య దళారులు ఇలా రైతుల ఇంటికి వెళ్లి తక్కువ ధరకే నేరుగా పత్తి పంట కొనుగోలు చేస్తున్నారు. ఇదంతా జరుగుతున్నా వ్యవసాయాధికారులుగానీ, మార్కెటింగ్ అధికారులుగానీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

# లాభాలనిచ్చే.. శనగ సాగు..

గాంధారి,: యాసంగి ఆరుతడి పంటల్లో ప్రధానమైన శనగను కామారె డ్డి జిల్లాలోని పలు మండలాల్లో అధికంగా సాగుచేస్తున్నారు. మార్కెట్ లో శనగ ఉత్పత్తులకు డిమాండ్ ఉండడంతోపాటు, తక్కువ పెట్టుబడి, నీటి వనరులు లేకున్నా పండుతుండడంతో చాలా మంది రైతులు శనగ వైపు దృష్టి సారించారు. వానకాలంలో సాగు చేసిన సోయా, మక్కజొన్న, మినుము, పెసర వంటి పంటలు కోసిన వెంటనే, తడిగా ఉన్న వ్యవసాయ భూముల్లో రైతులు శనగ విత్తనాలను వేశారు. ఈ సంవత్సరం కామారెడ్డి జిల్లాలో దాదాపు 45వేల ఎకరాల్లో శనగ పంటను సాగుచేస్తున్నారు. శనగ వేసిన తర్వాత భూమిలో తడి ఉంటే చాలు విత్తనం మొలకెత్తుతుంది. అనంతరం వాతావరణంలో ఉండే మంచు, నీటి బిందువులను గ్రహించి పంట ఏపుగా పెరుగు తుంది. యాసంగిలో సాగు చేయడం సులువుగా ఉండడంతోపాటు ఈ ఏడాది అనుకున్న విధంగా వర్షాలు కురవడంతో చాలా మంది రైతులు శనగ పండించారు. జిల్లాలో నల్లరేగడి భూములు అధికంగా ఉండడంతో యాసంగిలో శనగ పంట సాగువిస్తీర్ణం పెరిగింది.

45వేల ఎకరాల్లో శనగ సాగు..: కామారెడ్డి జిల్లాలో ఈ సంవత్సరం దాదాపు 45వేల ఎకరాల్లో శనగ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ప్రభుత్వం యాసంగిలో ఆరుతడి పంటలను వేసుకోవాలని తెలుపడానికి ముందుగానే జిల్లాలో చాలా మంది శనగ పంటను సాగు చేశారు. విత్తనాలు విత్తుకునే సమయంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో శనగ పంట సాగుకు భూములు అనుకూలంగా మారా యి. దీంతో నల్లరేగడి భూములు అధికంగా ఉన్న గాంధారి, సదాశివ నగర్, జుక్కల్, మద్నూర్, బిచ్కుంద, తాడ్వాయి, పిట్లం,



భిక్కనూరు, దోమకొండ, పెద్దకొడప్‌గల్, ఎల్లారెడ్డి, లింగంపేట్, రాజంపేట్ తదితర మండలాల్లో రైతులు శనగ పంటను సాగు చేస్తున్నారు. మార్కెట్‌లో భలే డిమాండ్..: శనగ పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నది. శనగలతోపాటు, మార్కెట్‌లో శనగ పప్పు, శనగ పిండి, పుట్నాలకు గిరాకీ బాగున్నది.

దీంతో రైతులు పండించిన శనగ మంచి ధర పలుకుతున్నది. శనగ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉండడంతో చాలా మంది రైతులు యాసంగిలో సాగు చేసేందుకు ఆసక్తి చూపారు.

అన్నదాత హర్షం..: రైతులు సాగుచేస్తున్న శనగ పంట ప్రస్తుతం ఏపుగా పెరిగి రిబ్బలు కట్టి, పూత, కాత దశలో ఉన్నది. శనగ పంటకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు సంతోషపడుతున్నారు. ప్రస్తుతం సాగుభూముల్లో సరైన తేమ ఉ ండడంతో శనగ పంట ఏపుగా పెరుగుతుందని, గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం అధిక దిగుబడులు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మళ్లీ టీడీపీ వైపు చూపు..

అనంతపురం, : ఎన్నికలు దగ్గర పడే కొద్దీ తమ రాజకీయ భవిష్యత్ కోసం నేతలు చివరి నిమిషం వరకూ ప్రయత్నిస్తూనే ఉంటారు. తాము ఉన్న పార్టీలో తమకు గౌరవం, టిక్కెట్ వస్తుందన్న నమ్మకం లేకపోతే ఇక పార్టీని వీడటం ఖాయం. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో కూడా అదే జరుగుతుంది. వైసీపీలో ఉన్న అసంతృప్తి నేతలు టీడీపీ వైపు చూస్తున్నారు. మరో వైపు చంద్రబాబు చివరి నిమిషంలో వస్తే కుదరదని చెప్పడంతో టీడీపీ వైపు దూకేందుకు కొందరు నేతలు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిసింది. వైసీపీలో ప్రాధాన్యత లేక... అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలో మాజీ మంత్రి శమంతకమణి, ఆమె కూతురు మాజీ ఎమ్మెల్యే యామిని బాలలు టీడీపీ వైపునకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలుస్తోంది. వారికి వైసీపీలో తగిన పదవులు లభించక పోవడం, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పట్టించుకోక పోవడంతో మనస్తాపంతో ఉన్నారు.

వైసీపీలో తాము కొనసాగితే రాజకీయంగా భవిషయత్ ఉండదని వారు భావిస్తున్నారు. శమంతకమణి కాంగ్రెస్ నుంచి టీడీపీలోకి వచ్చారు. టీడీపీలో చంద్రబాబు సముచిత గౌరవాన్ని ఇచ్చారు. శమంతకమణికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు.ఆమె కూతురుయామినీ బాలకు 2014లో ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వడంతో ఆమె గెలిచారు. కానీ 2019 ఎన్నికల్లో వీరికి టిక్కెట్ ఇవ్వకుండా జేసీ అనుచరులైన బండారు శ్రావణికి చంద్రబాబు టిక్కెట్ ఇచ్చారు. దీంతో వీరు వైసీపీలోకి జంప్ చేశారు. వైసీపీలో చేరిన తర్వాత అనేక పదవుల కోసం ఎదురు చూశారు.. కానీ ఎమ్మెల్సీ పదవిని ఆశించిన శమంతకమణికి నిరాశ ఎదురయింది. భవిష్యత్ లో కూడా వస్తుందన్న ఆశలేదు. ఇక వచ్చే ఎన్నికల్లోనూ తమ కుటుంబానికి టిక్కెట్ లభిస్తుందన్న గ్యారంటీ లేదు. ఎందుకంటే ఇక్కడ జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త సాంబశివారెడ్డి స్ట్రాంగ్ అయ్యారు. టీడీపీ పరిస్థి?తి టీడీపీ నుంచి హామీ లభిస్తే దూకేందుకు సిద్దంగా ఈ తల్లీ కూతుళ్లున్నారు. మరి చంద్రబాబు వీరి రాకకు ఓకే చెబుతారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

# ఖాళీ అవుతున్న గ్రామాలు..

ఖాట్మాండు, : భారత సరిహద్దుల్లో చైనా కొత్తగా గ్రామాలను నిర్మిస్తోం దని, ప్రజలను తరలిస్తోందని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ వైపు చైనా-నేపాల్ సరిహద్దుల్లోని గ్రామాలు ఖాళీ అవుతుం డడం ఆందోళన కలిగిస్తోంది. సరిహద్దులను విడిచి వలస వెళుతున్నారు ప్రజలు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని పిథోరాగఢ్ జిల్లాలో చైనా- నేపాల్ సరిహద్దుల్లో ఉన్న 59 గ్రామాలు ఇప్పటికే ఖాళీ అయ్యాయి. ఏ గ్రామంచూసినా మనిషి జాడ కనిపిండం లేదు. పిథోరాగఢ్ జిల్లాలో ప్రస్తుతం 1542 గ్రామాల్లోనే ప్రజలు ఉన్నారు. మూడేళ్ల క్రితం ఆ సంఖ్య 1601గా ఉండేది. 59 గ్రామాలు పూర్తిగా ఖాళీ అయ్యాయి. ఇందులో పిథోరాగఢ్ ఏరియాలో 13, గంగోలీహాట్, డీడీహాట్, బెరీనాగ్ తాలుకాల్లో ఒక్కోదాంట్లో ఆరు, ధారచూలాలో 3, గణాఈ- గంగోలీ, ఫాంఖూ, థాల్‌లో 3 చొప్పున గ్రామాలు ఖాళీ అయ్యాయి. మూడేళ్ల క్రితం గ్రామాల్లో 16వేల మంది జనాభా ఉండేదని వివరిం చారు జల్ నిగమ్ అధికారి రంజీత్ ధర్మసత్తూ. 2019, 2020, 2021లో ఇంటింటి సర్వే చేపట్టామని, బ్రాహ్మణ క్షేత్రంలోని 1601 గ్రామాల్లో సుమారు 40 నుంచి 50 గ్రామాలు గడిచిన మూడేళ్లలో దాదాపుగా ఖాళీ అయ్యాయి అని తెలిపారు, జల్ నిగమ్ అధికారి రంజీత్ ధర్మసత్తూ.ఉత్తరాఖండ్ రాష్ట్రం ఏర్పడి 21 ఏళ్లు గడుస్తోంది. సరిహద్దు ప్రాంతాల్లో అభివృద్ధి కోసం రెండు దశాబ్దాలుగా ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చించాయి. కానీ, ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో కనీస వసతులు లేవు. చాలా గ్రామాలకు సరైన రోడ్లు లేవు. విద్యుత్తు, నీరు, సమాచారం, ఆరోగ్యం, విద్య, ఉపాధి వంటి సౌకర్యాలు లేకపోవ డం వల్ల వలసలు పెరుగుతున్నాయి. సరైన వైద్య సౌకర్యం లేకపోవడ మే వలసలకు ప్రధాన కారణం అనే వాదనలు వినిపిస్తున్నాయి.ఇదే అంశానికి సంబంధించి పిథోరఘర్ జిల్లా అభివృద్ధి అధికారి గోపాల్ గిరి గోస్వామి మాట్లాడుతూ, "రోడ్డు కనెక్టివిటీ లేకపోవడంతో, ఉపాధి అవకాశాలు తగ్గుతుండటంతో ఈ గ్రామాల నుండి ప్రజలు వలస వెళ్లడానికిప్రధాన కారణాలు." అని అన్నారు. జిల్లాలోని భటాడ్ గ్రామానికి చెందిన ప్రకేష్ పాండే మాట్లాడుతూ, "మెరుగైన మౌలిక సదుపాయాలు, ఉద్యోగ అవకాశాల కోసం ప్రజలు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వలస వెళు తున్నారు. అంతేకాకుండా, ఆరోగ్య మరియు విద్య సౌకర్యాల కొరత స్థానికులను పట్టణ కేంద్రాలకు తరలించడానికి ప్రేరేపిస్తుంది. ఈ గ్రామాల్లోవ్యవసాయ భూములుబీడుగా మారాయని, చిరుతపులి వంటి వన్యప్రాణులు తరచూ సంచరిస్తున్నాయని తెలిపారు.

# చిన్నారులపై ఒమిక్రాన్ పడగ..! ముప్పు తప్పదా..?

కరోనా మహమ్మారి కొత్త వేరియంట్ ఒమిక్రాన్ ఇప్పుడు అందరినీ టెన్షన్ పెడుతోంది.. ఫస్ట్ వేవ్, సెకండ్ వేవ్.. ఇప్పుడు ఒమిక్రాన్ కొత్త వేరియంట్ థర్డ్ వేవ్‌కు కూడా దారితీసే ప్రమాదం ఉందనే హెచ్చరికలు ఉన్నాయి.. అయితే, ఫస్ట్‌వేవ్, సెకండ్ వేవ్ సమయంలోనూ చిన్నారులు కరోనా బారినపడ్డా.. ఇప్పుడు ఒమిక్రాన్ చిన్నారులపై పడగ విప్పుతుందా? అనే టెన్షన్ మొదలైంది.. దానికి కారణం లేకపోలేదు.. ఎందుకంటే.. తాజాగా పశ్చిమ బెంగాల్‌లో మొదటి ఒమిక్రాన్ పాజిటివ్ కేసు నమోదైంది. ముర్షిదాబాద్ జిల్లాకు చెందిన ఏడేళ్ల బాలుడికి ఒమిక్రాన్ పాజిటివ్‌గా తేలింది.. ఈ చిన్నారి తల్లిదండ్రులతో కలిసి అబుదాబి నుంచి డిసెంబర్ 10న హైదరాబాద్ మీదుగా పశ్చిమ బెంగాల్‌కు చేరుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. అబుదాబి నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోగానే ఆర్టీ- పీసీఆర్ టెస్ట్ కోసం నమూనాలు సేకరించారు. బాలుడి నుంచి సేకరించిన నమూనాలో జీనోమ్ సీక్వెన్సింగ్ ఒమిక్రాన్ వేరియంట్ పాజిటివ్‌గా తేలింది.. కానీ, బాలుడి తల్లిదండ్రులకు ఒమిక్రాన్ నెగిటివ్‌గా వచ్చింది? దీంతో.. ముర్షిదాబాద్ జిల్లాలో




స్థానిక ఆసుపత్రిలో బాలుడికి చికిత్స అందిస్తున్నారు.. భారత్‌లో ఇప్పటి వరకు 40కి పైగా ఒమిక్రాన్ పాజిటివ్ కేసులు వెలుగు చూడగా.. అందులో ఓ చిన్నారి కూడా ఉండడం ఇప్పుడు కలవరానికి గురిచేస్తోం ది.. ఒమిక్రాన్ నుంచి ప్రాణాపాయం పెద్దగా లేదని చెబుతున్నా.. జెట్ స్పీడ్‌తో వ్యాపిస్తోంది.. మరి.. చిన్నారులపై దీని ప్రభావం ఏస్థాయిలో ఉంటుంది అనేది మాత్రం తేలాల్సిఉంది.

## పెరిగిపోతున్న భూ సమస్యలు...

# కనిపించని ల్యాండ్ సర్వేయర్లు



హైదరాబాద్, : ఇద్దరు వ్యక్తులు గానీ, ఒకే సర్వే నెంబర్‌లో భూమిని సాగుచేస్తున్న రైతులకు గానీ భూ సమస్య వచ్చినప్పుడు పరిష్కరించే నాథుడే కరువైయ్యారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం భూ పంచాయితీలు కోకొల్లాలుగా వస్తున్నాయి. పొలం గట్ల మధ్య పంచాయితీతో భూమిని సాగు చేయకుండా వదిలివేయడం జరుగుతుంది. దీంతో సమస్య మరింత జఠిలమై భూ వివాదాలకు కారణమవుతున్నాయి. ఈ సమస్యలను సకాలంలో పరిష్కారించాలని బాధితులు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకుంటున్నారు. అందుకు అనుగుణంగా భూ సర్వేయర్లు అందుబాటులో ఉండాలి. వీళ్లు అందుబాటులో లేకపోవడంతో ప్రతి రోజు పంచాయితీలకు గ్రామలు అడ్డాగా మారిపోయాయి.అత్యవసర పరిస్థితిలో భూములను సర్వే చేయాల్సి ఉన్నప్పుడు కూడా రోజుల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి తెలంగాణ రాష్ట్రంలో దాపురించింది. నిన్న మొన్నటి వరకు రైతులు.. హెచ్చుతగ్గులుగా భూమి ఉన్నప్పటికీ సాగు చేయడం నిలిపివేసే వాళ్లు కాదు. నేడు భూములకు ధరలు పెరిగిపోవడంతో ప్రతి ఒక్కరూ భూములను సర్వే చేసిన తర్వాతనే సాగుకు మొగ్గుచూపు తున్నారు. ఇలాంటి కష్టకాలంలో జిల్లాలకు సరియైన సర్వేయర్లు లేకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రంగారెడ్డి,వికారాబాద్ జిల్లాలో కలిపి మొత్తం 52 మంది సర్వేయ ర్లుండాలి. కానీ, అందులో సగం మంది లేకపోవడం గమనార్హం. రంగారెడ్డి జిల్లాలో 5 డివిజన్లు, 27 మండలాలుండగా కేవలం 14 మంది మాత్రమే సర్వేయర్లున్నారు. అదే వికారాబాద్?జిల్లాలో రెండు డివిజన్లు, 18 మండలాలకు ఏడుగురు పనిచేస్తున్నట్లు అధికారులు వివరిస్తున్నారు. మిగిలిన పోస్టులన్నీ ఖాళీలుగానే మిగిలిపోయాయి. గత ఐదేండ్లకు పైగా ఒక సర్వేయర్?రెండు, మూడు మండలాలకు ఇన్‌చార్జీలుగా పనిచేస్తున్నారు. దీంతో సర్వేయర్లకు డిమాండ్ పెరిగిపోయింది.జిల్లాలో మంజూరు పోస్టుల్లో సగం మంది సర్వేయర్లు ఉన్నారు. ఇందులో కొంత మంది సర్వేయర్లు వివిధ భూసేకరణ విభాగంలో పనిచేస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలోని 14 మందిలో మండలాల్లో 10 మంది పనిచేస్తున్నారు. వికారాబాద్? జిల్లాలో 10 మందిలో 8 మంది సర్వేయర్లే మండలాల్లో పనిచేస్తున్నారు. మిగిలిన సర్వే డిప్యూటేషన్ పద్ధతిలో జిల్లాలోని భూ సేకరణ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు.అవసరాలను అనుగుణంగా సర్వేయర్లు పనిచేయడం షురూ చేస్తున్నారు. రంగారెడ్డి, వికారాబాద్?జిల్లాలో వేల సంఖ్యల్లో దరఖాస్తులు పెండింగ్‌లో పేరుకపోతున్నాయి.

## మంగళగిరి దొంగతనం కేసులో ఇద్దరు అరెస్ట్

గుంటూరు : పటమట లంక పంట కాలువ రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌లో చోరీని పోలీసులు చేధించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.9.72 లక్షల నగదు, 6.7 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ వీ హర్షవర్ధన్ రాజు కేసు వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరి మార్కండేయ కాలనీకి చెందిన వేముల శ్రీను శ్రీలక్ష్మి అపార్ట్‌మెంట్‌లో గత కొన్నేండ్లుగా వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతడి భార్య లక్ష్మి పనిమనిషిగా పనిచేస్తున్నది. అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో నివసించే ఓ కుటుంబం ఈ నెల 10న హైదరాబాద్ వెళ్తున్నారని తెలుసుకున్న నిందితులు.. భార్యను పుట్టింటికి పంపించి, అదే రోజు రాత్రి ఇనుప రాడ్‌తో ఫ్లాట్ తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. చోరీ సొత్తులో రూ.4.72 లక్షలు, కొంత బంగారు ఆభరణాలు తన వద్దే ఉంచుకున్నాడు. మిగిలిన సొత్తును గుంటూరు జిల్లా పెదకాకానిలో నివాసముంటున్న అన్నయ్య వేముల మహేష్ వద్ద దాచిపెట్టాడు.

# పెరిగిపోతున్న ఆదాయ అసమానతలు

దేశంలో రోజురోజుకీ ఆదాయ అసమానతలు భారీగా పెరిగిపోతు న్నాయి. ధనిక ప్రజలు మరింత ధనవంతులు అవుతుంటే.. పేద ప్రజలు ఇంకా పేదరికంలో జారుకుంటున్నారు. 2021 జాతీయ ఆదాయంలో ఐదో వంతు కేవలం ఒక శాతం మంది దగ్గరే ఉ న్నట్లు ప్రపంచఅసమానత నివేదిక తెలిపింది.భారత్‌లో ఆదాయప రమైన అసమానతలు భారీగా పెరిగిపోతున్నట్లు వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ నివేదిక వెల్లడించింది. 2021లో మొత్తం జాతీయ ఆదాయం లో ఒక శాతం ధనవంతులైన భారతీయుల వద్ద 22 శాతం సంపద కలిగి ఉన్నారని ఈ నివేదిక తెలిపింది. ఇక ధనవంతుల జాబితాలో ఉన్న తొలి10 శాతం మంది చేతిలో 57శాతం ఆదాయం ఉ న్నట్లు పేర్కొందిఆదాయ అసమానతలు ఎక్కువగా ఉన్న దేశాల్లో ఇండియా కూడా ఉందని వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్ట్ 2022 వెల్లడించింది. దేశంలో పేదరికం పెరిగిపోతోందని తెలిపింది. ఆదాయంలో ఉన్నత వర్గాల వాటా ఏటేటా పెరిగిపోతుంటే, కిందిస్థాయిలో ఉన్నోళ్ల వాటా ఇంకా తగ్గుతోందని పేర్కొంది. దేశ ఆదాయంలో 65 శాతం కేవలం 10 శాతం మంది దగ్గర, అందులోనూ 22 శాతం ఆదాయం కేవలం ఒక్క శాతం జనాభా దగ్గరే ఉందని తెలిపింది. అట్టడుగు వర్గాలకు చెందిన 50 శాతం జనం సంపాదించే మొత్తం కేవలం 13 శాతమేనని వివరించి ంది.దేశంలో సగటున ఒక్కో వ్యక్తి ఆదాయం రూ.2,04,200 ఉ ండగా.. 50 శాతం జనాభా సంపాదించేది కేవలం రూ.53,610 మాత్రమేనట. వీరికి 20 రెట్లు ఎక్కువగా.. 10 శాతం జనాభా ఆదాయం రూ.11,66,520 ఉందన్నారు. మధ్య తరగతి వారి వద్ద 29.5 శాతం సంపద ఉందని వెల్లడించింది. అదే పైన ఉన్న 10 శాతం మంది వద్ద 65 శాతం, 1 శాతం మంది దగ్గర 33 శాతం సంపద ఉన్నట్లు తెలిపింది. మధ్యతరగతి వారి వద్ద సగటున రూ.7,23,930ల సంపద ఉన్నట్లు నివేదించింది. అదే పైన ఉన్న 10 శాతం మంది దగ్గర సగటున రూ.63,54,070, ఒక శాతం మంది వద్ద రూ.3,24,49,360 సంపద ఉన్నట్లు తెలిపింది. జెండర్ విషయంలో..ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంస్కరణల వల్ల ఉన్నత వర్గాలకు చెందిన ఒక్క శాతం మంది భారీగా లాభపడ్డారని ఈ రిపోర్టు తెలిపింది. జెండర్ విషయంలోనూ దేశంలో ఇనీక్వాలిటీ ఎక్కువే ఉందని చెప్పింది. ఆసియాలో ఒక్క చైనా తప్ప మిగతా దేశాల్లో మహిళా కార్మిక ఆదాయ వాటా 21 శాతం ఉండగా.. ఇండియాలో ఇది కేవలం 18 శాతం మాత్రమేనని వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్టు వెల్లడించింది.1985 తర్వాత ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఆర్థిక సంస్కరణల వల్ల ఆదాయ, సంపద విషయంలో అసమానతల్ని పెంచాయని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా పైన ఉన్న ఒక శాతం మంది ఆర్థిక సంస్కరణల వల్ల భారీ లబ్ధి పొందారని తెలిపింది. తక్కువ, మధ్య ఆదాయ సమూహాల మధ్య వృద్ధి సాపేక్షంగా ఉ న్నట్లు పేర్కొంది. 1985 తర్వాత నుంచి నేటికి పేదరికం పెరుగుతు న్నట్లు ఈ నివేదిక తెలిపింది. అలాగే, దేశంలో లింగ అసమానతలు కూడా చాలా ఎక్కువగా ఉన్నాయి. మహిళా కార్మిక ఆదాయ వాటా కేవలం 18 శాతం అని తెలిపింది. ఆసియాలో చైనా మినహా మహిళా కార్మిక ఆదాయ వాటా 21 శాతం కంటే తక్కువ ఉన్నట్లు తెలిపింది. సంపదలో కింద ఉన్నవారి సగటు ఏడాది సంపద రూ.53,610 అయితే, టాప్ 10 సంపన్నుల ఆదాయం చాలా ఎక్కువగా ఉంది. భారత్‌లోని కుటుంబాల సగటు రూ.9,83,010గా ఉంది.

# కబ్జా కోరల్లో.. కాల్వ కట్టలు?

నేరేడుచర్ల,:ఉమ్మడి నల్గొండ జిల్లాలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు సంబంధించిన స్థలాల కబ్జా యథేచ్ఛగా సాగుతున్నా.. ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. తాజాగా సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలో ఫత్తేపురం ఆర్–8 ఎత్తిపోతల పథకం పక్కన ఎడమ కాల్వ కట్ట స్థలాన్ని చదును చేసి, మడులుగా మార్చి సాగర్ ఎడమ కాల్వకు పైప్‌లైన్లు వేసి సాగుకు సిద్ధం చేశారు. ప్రభుత్వం సాగర్ ప్రధాన కాల్వతో పాటు మేజర్లకు బౌండరీలు గుర్తించి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని గతేడాది నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించిన విషయం విదితమే. దీనికి సంబంధించి కొన్నిచోట్ల మార్కింగ్ సైతం ఇచ్చారు. ఒకరిని చూసి ఒకరు కాస్త వెడల్పుగా ఉన్న చోట ఆక్రమణలు జరిపి వరి సాగు చేపడుతున్నారు. ఎడమ కాల్వకు ఇరువైపులా కట్టలతో పాటు కొన్ని చోట్ల విశాలంగా స్థలాలు వదిలారు. ఆ స్థలాలను వినియోగించేవారు చాలా చోట్ల ఆక్రమించడంతో కట్టల పరిధి సైతం తగ్గిపోతోంది. కాల్వ కట్టల వెంట నిల్వ ఉంచిన ఎత్తయిన మట్టి గుట్టలు కాస్తా కనుమరుగై పోతుండటంతో భవిష్యత్తులో కాల్వ కట్టలకు గండ్ల ముప్పు పెరగనుంది. ఇదే పంచాయతీ పరిధిలో సాగర్ కాల్వల నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన ప్లాంట్ స్థలాలు సైతం ఇప్పటికే ఆక్రమణల పాలయ్యాయి. మేడారం శివారులోనూ కాల్వ కట్టల ఆక్రమణ ఎక్కువగా ఉంది. జాన్‌పహాడ్ మేజర్ పరిధిలోని ఆర్–3 కాల్వను నేరేడుచర్ల పట్టణంలో ఓ వైపు కట్ట రెండు, మూడు కిలోమీటర్ల మేర పూర్తిగా ఆక్రమించేశారు.



దీనికి తోడు పట్టణవాసులు కాల్వలో వ్యర్థాలు పోస్తుండటంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. మిర్యాలగూడ, హుజూర్‌నగర్ ప్రాంతాలలో కాల్వకట్టల ఆక్రమణలపై పలుసార్లు స్థానికులు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. ఆక్రమణలకు గురవుతున్న స్థలాన్ని రెవెన్యూశాఖ హరితహారం, ఇతర ప్రభుత్వ అవసరాల కోసం ఏడెకరాల వరకు గ్రామపంచాయతీకి అప్పగించింది. ఈ ఆక్రమణలను వారే నిలువరించాల్సి ఉంటుంది. సాగర్ ఎడమ కాల్వ స్థలాలను ఆక్రమిస్తున్న విషయం వాస్తవమే. ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలు ఇస్తే తప్ప వీటిని ఆపలేని పరిస్థితి. చాలా చోట్ల ఇప్పటికే కాల్వ స్థలాల ఆక్రమణలు జరిగాయి. ఫత్తేపురం వద్ద జరుగుతున్న ఆక్రమణలను నిలువరిస్తాం.

# ధరణిలో పేరు కనిపిస్తే.. మళ్లీ విక్రయం!

నాగర్‌కర్నూల్:ధరణి రాక ముందు భూముల రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాత మ్యుటేషన్ చేయించుకోకపోతే ఆ భూములన్నీ మళ్లీ ధరణిలో పాత పేర్లపైనే కనిపిస్తున్నాయి. దీనిని ఆసరాగా తీసుకొని కొందరు ఆయా భూములు తమవే అంటూ మళ్లీ అమ్ముకుంటున్నారు. భూముల ధరలు పెరగటంతో అనేక వివాదాలకు దారి తీస్తున్నాయి. ధరణిలో పాత యజమానుల పేర్లు వస్తున్నా.. తహసీల్దార్లు ఏమి చేయలేకపోతున్నారు. బాధితులు సంప్రదిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచిస్తున్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్లలో నిర్వహించే ప్రజావాణికి సైతం 90 శాతం దరఖాస్తులు భూ వివాదాలకు సంబంధించినవే ఉంటున్నాయి. కోర్టులకు వెళ్లిన సర్వే నంబర్లన్నింటికి ధరణిలో ఎలాంటి లావాదేవీలు జరుపకుండా నిలిపివేస్తున్నారు. దీంతో చాలా మంది రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురం రోడ్డులో రమేశ్ 1.20 ఎకరాల భూమిని ధరణి రాకముందు కొనుగోలు చేశారు. మ్యుటేషన్ చేయించుకునే సమయంలోనే ధరణి వచ్చేసింది. ధరణిలో రమేశ్‌కు అమ్మిన వ్యక్తి పేరు కనిపించింది. దీంతో ఆ భూమిని పాత యజమాని మళ్లీ ఇతరులకు అమ్ముకున్నాడు. ఆ భూమి విలువ ప్రస్తుతం రూ.40లక్షలు. దీంతో రమేశ్ ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. నాగర్‌కర్నూల్ మండలం నాగనూల్ శివారులో మధుసూదన్ 1.30 ఎకరాల భూమిని కొనుగోలు చేసి మ్యుటేషన్ చేయించుకోలేదు. ఆ తర్వాత అతను మ్యుటేషన్‌కు వెళ్లే సరికే ఆ భూమి ఇద్దరి చేతులు మారింది. దీనికి పక్కనే ఉన్న ఆరు ఎకరాల భూమి ఇదే సర్వే నంబరు కావడం, ఎకరా భూమి రూ.40లక్షలకు పైగా ఉండటంతో వివాదాస్పదమైంది. నిత్యం



ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. కొల్లాపూర్, కొడేరు, పెద్దకొత్తపల్లి మండలాల్లో ధరలు పెరుగటంతో గతంలో అమ్మిన వారే ధరణిలో తమ పేర్లు వచ్చాయనే నెపంతో మళ్లీ అమ్ముకున్న సంఘటనలు 10 వరకు ఉన్నాయి. అవన్ని ఇప్పుడు కోర్టు వివాదంలో నడుస్తున్నాయి. ధరణి కంటే ముందు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు ఇప్పుడు ధరణిలో పాత పేర్లే వస్తే పెండింగ్ మ్యూటేషన్ కింద ధరఖాస్తులు చేసుకోవాలి. అప్పటికే ధరణిలో పేరు ఉన్న వ్యక్తి నిజాయతీ తప్పి లావాదేవీలు జరిపితే కోర్టుకు వెళ్లాల్సిందే. న్యాయస్థానం ద్వారా ఆదేశాలు తెచ్చుకొని అమలు చేసుకోవాలి. ఇప్పుడు అలాంటివి సరిచేయటానికి తహసీల్దార్ల వద్ద ఎలాంటి అధికారాలు లేవు. కొన్ని చోట్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. తమ పరిధిలో ఉన్నవి చాలా వరకు భూముల సమస్యలను పరిష్కరిస్తున్నాం. కోర్టుల్లో పెండింగ్‌లో ఉంటేనే పెండింగ్‌లో ఉంటున్నాయి.

# చిరు వ్యాపారుల బతుకుల్లో ఆర్థిక వెలుగు



వనపర్తి, :కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పురపాలికల్లోని వీధి వ్యాపారుల అభ్యున్నతికి పెద్దపీట వేయడంతో వారిలో భరోసా పెరిగింది. వేలకు వేల రూపాయల అద్దెలు, రూ.లక్షల్లో అడ్వాన్సులు చెల్లించలేక రహదారుల వెంట చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్న వారికి ఆర్థికంగా మరింత చేయూతనిచ్చేందుకు కేంద్రం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటా యించింది. మూడేళ్ల క్రితం కొవిడ్ కారణంగా లాక్‌డౌన్ విధించడంతో రోజూ ఫుట్‌పాత్‌లపై కూర్చుని చిరు వ్యాపారాలు చేసుకునే వీధి వ్యాపారుల జీవితాలు ఒక్కసారిగా కుదేలయ్యాయి. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వం స్పందించి వీధి వ్యాపారులను ఆదుకునేందుకు ప్రధానమంత్రి స్వనిధి (ఆత్మనిర్భర్) పథకాన్ని ప్రవేశపెట్టి చేయూతనిచ్చింది. పట్టణ పేదల నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో సర్వే చేయించి, అర్హులైన చిరు వ్యాపారులను గుర్తించి, వారికి గుర్తింపుపత్రాలిచ్చారు. ఎంపికచేసిన వారికి మొదటి, రెండో విడతల్లో రుణ సాయం అందించి ఆదుకుంది. వన పర్తి జిల్లాలోని అయిదు పురపాలక సంఘాల్లో కలిపి మొత్తం 6611 మంది వీధివ్యాపారులున్నట్టు గుర్తించి గుర్తింపుపత్రాలు ఇచ్చారు. వీరి ఉపాధిని మెరుగుపరిచేందుకు ఆత్మనిర్భర్ పథకం కింద మొదటి విడతగా రూ.10 వేలు అందించారు. డబ్బు తీసుకున్నవారు సకాలంలో చెల్లిస్తే రెండో విడతలో రూ.20 వేలు ఇచ్చారు. తాజాగా కేంద్ర ప్రభుత్వ ప్రకటనలో ఈ రుణపరిమితి రూ.లక్ష వరకు పెరగనుంది. ఆత్మనిర్భర్ పథకం కింద కూరగాయల వ్యాపారానికి రెండు విడతల రుణం తీసుకున్నా. మార్చి నుంచి రుణం పెంచి ఇస్తారని తెలిసింది. మేము కంతులు చెల్లించిన దాన్ని బట్టి రూ.లక్ష వరకు రుణమిస్తారని అంటున్నారు. అలాగైతే నా కూరగాయల దుకాణాన్ని మరింతగా విస్తరించి వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటా. కరోనా కాలంలో పండ్ల వ్యాపారం పూర్తిగా కుదేలై అప్పు పుట్టలేదు. దీంతో పురపాలిక ద్వారా రుణాలిస్తున్నారని తెలిసి దరఖాస్తు చేసుకున్నా. రూ.10 వేల సాయం అందించారు. ఇచ్చిన రుణాన్ని చెల్లించేశా. మళ్లీ రుణం తీసుకుని వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటా. కేంద్రం అందించే ఆర్థిక సాయాన్ని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి. దీన్ని కుటుంబ ప్రగతికి ఓ నిచ్చెనగా చేసుకొని, ఆర్థిక ప్రగతి దిశగా సాగాలి. ఏప్రిల్ నుంచి ఆరంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరంలో రుణ పరిమితి రూ.లక్ష వరకూ పెరగనుంది. అందుకే చిరు వ్యాపారులు చక్కగా తమ వ్యాపారాభివృద్ధికి ఇప్పటినుంచే చక్కటి ప్రణాళిక వేసుకొని, నిధుల్ని సద్వినియోగం చేసుకోవాలి.

# వరుస కడుతున్న వలస కూలీలు

మోర్తాడ్, : పసుపు పంట వచ్చిందంటే ఆర్మూర్ డివిజన్ ఒక కళ సంతరించుకుం టుంది. ఈ ప్రాంతం లో పసుపు పంటను రైతులు అధికంగా పండించడమే అందుకు కారణం. పసుపు పంట చేతికి వచ్చిందంటే పసుపు తవ్వకం నుంచి మార్కెట్‌కు తరలించే వరకు కూలీల అవసరం ఉంటుంది. పసుపు తవ్వకాల నుంచి ఉడకబెట్టేం దుకు మహారాష్ట్ర నుంచి కూలీలు ఈప్రాంతానికి తరలివస్తారు. మహారాష్ట్రలోని నాందేడ్‌తోపాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి వేల సంఖ్యలో కూలీలు డిసెంబర్ మాసంలోనే ఇక్కడికి వస్తారు. మా ర్చి వరకు ఇక్కడే ఉంటారు. దాదాపు మూడు వేలకు పైగా కూలీలు మహారాష్ట్ర నుంచి ఇక్కడికి తరలివస్తారని అంచనా. పసుపు తవ్వకాల నుంచి పసుపును మార్కెట్‌కు తరలించే వరకు వివిధ రకాల పనుల కోసం మహారాష్ట్ర నుంచి నిజామాబాద్ జిల్లాకు దాదాపు మూడు వేలకు పైగా కూలీలు ఏటా తరలివస్తుంటారు. ఇక్కడి ప్రాంత రైతులతో సమాచారాన్ని అందుకొని కుటుంబాలతోసహా తరలివచ్చి నాలుగు నెలలపాటు ఇక్కడే ఉంటారు. పసుపు ఆవిరిపట్టే యంత్రాలు కలిగి ఉన్న రైతులు కూలీల గ్యాంగులను ఇక్కడికి రప్పిస్తారు. ఒక్కో గ్యాంగ్‌లో ఎనిమిది నుంచి పది మంది వరకు ఉంటారు. ఈవిధంగా ఆర్మూర్ డివిజన్‌లో దాదాపు మూడు వందల వరకు ఆవిరియంత్రాలు ఉ ంటాయి. దాదాపు మూడు వేల మంది కూలీలు ఈప్రాంతానికి తరలివస్తుంటారు. పసుపు ఉడకబెట్టే కూలీలను ఎక్కడ చూసినా మహారాష్ట్రకు సంబంధించిన వారే ఉంటారు. పసుపు సీజన్‌లో వచ్చిన కూలీలు ఒక్కొక్కరు కనీసం రూ.40–50వేల వరకు సంపాదించుకుని తిరిగి వెళ్తారు. ఆవిరియంత్రం ద్వారా పసుపును ఉడకబెట్టే మహారాష్ట్ర గ్యాంగులకు డ్రమ్ము పసుపు ఉడకబెట్టినందు కు రూ.80 చెల్లిస్తారు.



వీరు రోజుకు కనీసం 50 డ్ర మ్ముల పసుపును ఉడకబెడతారు. దీంతోపాటు పసుపు తవ్వకానికి వెళ్తుంటారు. సీజన్ ముగిసే వర కు కూలీలు ఇక్కడే ఉంటారు. వీరు గత 15సంవత్సరాలుగా ఈ ప్రాంతానికి పసుపు సీజన్‌లో వస్తున్నారు. మా గ్రామంలో కూడా కూలీ పనులే చేస్తుంటాం. పసుపు సీజన్ వచ్చిందంటే ని జామాబాద్ జిల్లాకు వస్తాం. పసుపు సీజన్ పూర్తయినంక తిరిగి వెళ్తాం. మాగ్యాంగ్‌లో ఎనిమిది మందిమి ఉన్నాం. ప్రతి రోజూ కనీసం రూ.500 ఒక్కో మనిషికి వచ్చేలా చూసుకుంటాం. మేము 15ఏండ్లుగా ఇక్కడికి వస్తున్నాం. మిషన్ ఓనర్ ఫోన్ చేయగానే ఇక్కడికి బయల్దేరుతాం. అందరం కలిసి పసుపును ఉడకబెట్టే పనులు చేస్తాం. ఒక్క డ్రమ్ము పసుపునకు రూ.80 ఇస్తారు. రోజుకు దాదాపు 50 డ్రమ్ముల పసుపును ఉ డకబెడతాం. సీజన్ ముగిసిన తర్వాత ఇంటికి వెళ్తాం.

# పంచాయతీల్లోనూ జనన, మరణ ధ్రువపత్రాలు

ధన్వాడ:జ నన, మరణ ధ్రువపత్రాల జారీలో ప్రస్తుతం మున్సిపాలిటీల్లో అమలు అవుతున్న విధానాన్ని గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం విస్తరించింది. దరఖాస్తును మీ సేవ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలి. ఈ వివరాలను పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరించుకున్నాక రికార్డుల్లో నమోదు చేసి ధ్రువపత్రం జారీ చేస్తారు. దీని ఆధారంగా మీ సేవ కేంద్రంలో పత్రాలు పొందవచ్చు. పారదర్శకతకు అవకాశం : చాలా మంది జనన, మరణ ధ్రువపత్రాలు అవసరం వచ్చినప్పుడే కార్యాలయాల చుట్టూ తిరుగుతారు. ఏళ్ల కిందట మరణించిన వ్యక్తుల ఆధారాల సేకరణ కష్టమవుతుంది. న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కోనే అవకాశం లేకపోలేదు. జనన,మరణ వివరాలను కార్యదర్శి రికార్డుల్లో నమోదు చేసి ఏడాది పాటు పంచాయతీల్లోనే ఉ ంచుకుంటారు. అనంతరం శాశ్వతప్రతిపాదికన వాటిని తహసీల్దార్లకు అప్పగిస్తారు. వాటి ఆధారంగా ధ్రువపత్రాలు జారీ చేస్తారు. ప్రస్తుత కొత్త విధానం ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేసినట్లయ్యింది. ఈ పత్రాలు లేని పక్షంలో సంక్షేమ పథకాలతో సహా ఇతర చిక్కులకు దారి తీసిన ఉదంతాలూ ఉన్నాయి. పత్రాలు కావాల్సిన వారు మీ సేవలో రూ.45 చెల్లించి రాష్ట్రంలో ఎక్కడి నుంచైన పొందే అవకాశం ఉంది. ఆన్‌లైన్ దరఖాస్తు నెంబరు ఎప్పటికీ భద్రంగా ఉంటుంది. మరణించిన వ్యక్తి పేరున ఒకసారి ధ్రువపత్రం జారీ అయితే ఎవరి ప్రమేయం లేకుండానే ఆసరా పింఛను, రేషన్ బియ్యం, ఓటరు కార్డు రద్దవుతుంది. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో కంప్యూటర్ల కొరత వేధిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 13 మండలాలు, 280 గ్రామ పంచాయతీలు ఉంటే 50 లోపు పంచాయతీ కార్యాలయాలకే కంప్యూటర్లు అందజేశారు. వీటి నిర్వహణకు కార్యదర్శులకు ఎలాంటి



శిక్షణ ఇవ్వలేదు. ధన్వాడ మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉ ండగా కేవలం నాలుగు పంచాయతీలకే కంప్యూటర్లు అందజేశారు. వీటి నిర్వహణపై శిక్షణ ఇవ్వని కారణంగా రెండు కంప్యూటర్లను మండల పరిషత్ కార్యాలయంలో ఉంచి ప్రత్యేకంగా ఒక వ్యక్తిని నియమించుకొని ఆపరేట్ చేస్తున్నారు. ప్రస్తుతం కంప్యూటర్లు లేని పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్‌కే జనన, మరణ దరఖాస్తుదారుడి వివరాలు తెలియజేయాల్సి వస్తోంది. ఈకారణంగా ధ్రువపత్రాల జారీలో జాప్యం జరిగే అవకాశం ఉంది. ప్రతి పంచాయతీకి కంప్యూటర్లు అందజేస్తే లక్ష్యం నెరవేరడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి. ప్రతి గ్రామ పంచాయతీకి ల్యాప్‌టాప్ లేదా కంప్యూటర్ ఇవ్వాలని ప్రభుత్వ ఆలోచన. దీనిపై సాధ్యమైనంత త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మండల పరిషత్ కార్యాలయంలోని కంప్యూటర్ల ద్వారా వివరాలు నమోదు చేసుకొని జనన, మరణ ధ్రువపత్రాలు జారీ చేస్తున్నాం.

# బడ్జెట్ వచ్చినా చెల్లింపులేవీ?

మోత్కూరు, : ఒక నెల వేతనం ఆలస్యమైతే నలుగురైదుగురు సభ్యులున్న కుటుంబాన్ని పోషించేందుకు యజమాని నానా ఇబ్బంది ఎదుర్కొంటాడు. అలాంటిది ఈ విద్యా సంవత్సరంలో హాస్టళ్లు తెరిచిన నాటి నుంచి ఎనిమిది నెలలుగా విద్యార్థుల డైట్ బిల్లును ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించేందుకు వార్డెన్లు తంటాలు పడుతున్నారు. అయినా ప్రభుత్వానికి పట్టడంలేదని వసతి గృహాల సంక్షేమాధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహాలకు సరుకులు సరఫరా చేసేందుకు ప్రభుత్వం టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్లకు అప్పగించాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్లు పాలు, పెరుగు, కూరగాయలు, నిత్యావసర సరుకులు సరఫరా చేస్తారు. కాగా, ప్రస్తుత విద్యాసంవత్సరంలో ప్రభుత్వం టెండర్లు నిర్వహించలేదు. దీంతో వసతి గృహ సంక్షేమాధికారులు సొంతంగా డబ్బు చెల్లించి సరుకులు సరుకులు సమకూర్చుతున్నారు. ఇంటి అవసరాలకు వాడాల్సిన వేతనాన్ని విద్యార్థులకు భోజనం అందించేందుకు వినియోగిస్తున్నారు. అంతేగాక దొరికిన చోటల్లా అప్పు చేసి విద్యార్థుల ఆకలి తీరుస్తున్నారు. ఎనిమిది నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 47 గిరిజన సంక్షేమ, 78 వెనుకబడిన తరగతుల సంక్షేమ, 80 ఎస్సీ సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. మొత్తం 205 హాస్టళ్లలో సుమారు 25వేల మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరికి పౌష్టికాహారం అందించేందు ప్రభుత్వం డైట్ బిల్లులు చెల్లిస్తోంది. 1 నుంచి 7వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ.950 ఇస్తోంది. అదేవిధంగా 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1100 చొప్పున, కళాశాల విద్యార్థులకు రూ.1500 చొప్పున డైట్ బిల్లు చెల్లిస్తోంది. ఈ ధరలు రెండేళ్ల క్రితం నిర్ణయించిన



కాగా, ప్రస్తుతం మార్కెట్లో నిత్యావసర సరకుల ధరలు రెట్టింపయ్యాయి. అయినా ప్రభుత్వం డైట్ బిల్లును మాత్రం పెంచలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎస్సీ, బీసీ సంక్షేమ విద్యార్థుల వసతి గృహ అధికారులకు హాస్టళ్లు తెరిచిన నాటి (జూన్)నుంచి ఎనిమిది నెలలుగా డైటు బిల్లుల చెల్లింపులు నిలిచాయి. బిల్లులు చేసి ట్రెజరీల్లో ఇచ్చి రెండుమూడు నెలలైనా బిల్లులు మంజూరు కావడంలేదు. గత ఏడాది అక్టోబరు వరకు బడ్జెట్ రిలీజ్ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. అయితే అక్టోబరు వరకు బిల్లులు చేసి ట్రెజరీలకు పంపగా, నేటికీ ఒక్క రూపాయి చెల్లించలేదని వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ట్రెజరీలకు పంపిన బిల్లులు నాలుగైదు రోజుల్లో మంజూరు కావడంతోపాటు బ్యాంకుకు వెళ్లేవి. దీంతో వార్డెన్లు బ్యాంకుకు వెళ్లి డబ్బు తీసుకునేవారు. కాగా, ప్రస్తుతం ట్రెజరీలకు పంపిన బిల్లులు మంజూరయ్యాక ఈ–కుబేర్‌కు వెళ్తున్నాయి. ప్రభుత్వ ఆర్థికశాఖ ఈ–కుబేర్ బిల్లులకు డబ్బు చెల్లిస్తుంది. అయితే చెల్లింపులపై ఆర్థికశాఖ ఆంక్షలు విధించడంతో ఈ–కుబేర్‌కు వెళ్తున్న బిల్లులకు డబ్బు మంజూరవడం లేదు. (

# ఇళ్లకు సౌర వెలుగులు



మహబూబ్‌నగర్ :విద్యుత్తు బిల్లు భారీగా రావటం పేద, మధ్య తరగతి కుటుంబాలకు భారంగా మారుతోంది. సరఫరాలో తరచూ అంతరాయాలు తలెత్తుతుండటంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సౌర విద్యుత్తు యూనిట్ ఏర్పాటు చేసుకుంటే ఈ ఇబ్బందులేవీ ఉ ండవు. ఎవరి ఇళ్లపై వారు తమకు అవసరమైన సామర్థ్యం మేరకు సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకొని విద్యుత్తును వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ దిశగా మహిళా సంఘాల సభ్యులను గ్రామీణాభివృద్ధి శాఖ సమాయత్తం చేస్తోంది. జిల్లాకు 200 – 300 యూనిట్ల లక్ష్యం : రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(టీఎస్ రెడ్కో) మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేటజిల్లాలకు ఈ ఏడాదికి 250–300 వరకు సౌర విద్యుత్తు యూనిట్లను కేటాయించింది. జోగులాంబ గద్వాల జిల్లాకు మాత్రం 200 యూనిట్లు కేటాయించింది.. వీటిని సద్వినియోగం చేసుకునేలా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన మహిళలకు అవగాహన కల్పించి ప్రోత్సహించేందుకు డీఆర్డీఏ సిబ్బంది, పురపాలికల్లో మెప్మా సీసీలను అధికారులు సమయాత్తం చేశారు. సౌర విద్యుత్తు యూనిట్ ఏర్పాటు చేసుకోవాలంటే లబ్ధిదారుకు ఆర్‌సీసీ మిద్దె కలిగిన ఇల్లు ఉ ండాలి. ప్రస్తుతం వారి గృహానికి నెలకు రూ. 160 నుంచి రూ.225 వరకు విద్యుత్తు బిల్లు వస్తూ ఉండాలి.

# అటవీశాఖ అర్బన్ పార్కు త్వరలో ప్రారంభం



నాగార్జునసాగర్, : నాగార్జునసాగర్ డివిజన్ అటవీశాఖ పరిధిలో నెల్లికల్లు బీట్‌లో రూ.1.50 కోట్లతో 250ఎకరాల్లో ఏర్పాటు చేసిన అటవీశాఖ అర్బన్ పార్కును త్వరలో ప్రారంభిస్తామని అటవీశాఖ రీజినల్ డైరెక్టర్ త్రినాథ్‌కుమార్ తెలిపారు. సాగర్ హిల్‌కాలనీ అటవీశాఖ కార్యాలయాన్ని సందర్శించి, తర్వాత బుద్ధవనం ప్రాజెక్టును తిలకించారు. సమ్మక్క–సారక్క దేవాలయం సమీపంలో నెల్లికల్లు బీట్‌లో ఏర్పాటు చేసిన అర్బన్ పార్కును పరిశీలించారు. పార్కులో నాటిన మొక్కలను మనుబోతులు తింటుడాన్ని గమనించిన ఆయన మనుబోతులు తినని మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. నేరేడు మొక్కలు ఇతర జంతువులు తినకుండా ఉన్నాయని వాటిని ఎక్కువగా నాటాలని సూచించారు. అర్బన్ పార్కులో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. వేసవి కాలం సమీపిస్తున్నందున్న అడవిలో జంతువలు దహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన సాసర్ ట్యాంకుల్లో నీళ్లు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎఫవో రాంబాబు, సాగర్ ఎఫ్‌డీవో సర్వేశ్వర్, ఎఫ్ఎసవో రమేష్ ఉన్నారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బుద్దవనం ప్రాజెక్టును అటవీశాఖ రీజనల్ డైరెక్టర్ త్రినాథ్ కుమార్ సందర్శించారు. అటవీశాఖ డివిజన్ పరిధిలో అబివృద్ధి పనుల పరిశీలించేందుకు నాగార్జునసాగర్‌కు వచ్చిన ఆయన బుద్దవనాన్ని సందర్శించారు.

Printed And Published By V.Narsingam, On Behalf Of Ch.V. Prabhakar Rao And Printed At Sri Sharadha Offset Printers. H.No.9-14/8/3, Buggaram Village And Mandal, Buggaram Gramapanchayath- 505454, Jagtial District, Telangana State.. Published At 6-6-206,Padma Nagar, Jagtial - 505327, Jagtial District, Telangana State.
Editor : Ch V. Prabhakar Rao, Rni T.C. Teltel 2021/81092 Phone : 9391533339 Email: Prajamantalu@Gmail.Com